



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 251 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు ఆదివారం 18 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 251 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SUN 18 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన ఏపీ మంత్రి నారా లోకేశ్

- ఇటీవల అమరావతి వచ్చిన ప్రధాని మోదీ
- ఢిల్లీ వచ్చి నన్ను ఎందుకు కలవడంలేదు అంటూ లోకేశ్ పై చిరుకోపం
- కుటుంబ సమేతంగా వెళ్లి మోదీని కలిసిన లోకేశ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీకి ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. శనివారం సాయంత్రం నారా లోకేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశం ప్రధానమంత్రి ఆహ్వానం మేరకే జరిగినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతిలో పర్యటించిన విషయం విదితమే. ఆ పర్యటన సందర్భంగా, నారా లోకేశ్‌ను ఢిల్లీ వచ్చి తనను కలవాల్సిందిగా ప్రధాని సూచించారు. ఈ నేపథ్యంలోనే, లోకేశ్ ఇవాళ తన కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిశారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ, లోకేశ్ దంపతుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుమారుడు, చిన్నారి దేవాన్ష్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ముచ్చటించారు. కుటుంబపరమైన విషయాలతో పాటు, ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలు కూడా వీరిరువురి మధ్య చర్చకు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



# అక్టోబర్ 2 నాటికి చెత్త లేని పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

- స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ తోడ్పడాలన్న సీఎం చంద్రబాబు
- రాయలసీమలో ఫ్యాక్షనిజానికి ఇకపై తావులేదని వెల్లడి
- సీమకు పరిశ్రమలు తెచ్చి, ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ



పెన్ పవర్ డెస్క్:స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ క్యాంప్ రైతుబజార్‌ను సందర్శించి రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, పలు కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా ప్రకటించారు. నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. గత ప్రభుత్వం పట్టణాల్లోనే 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసి పోయిందని, అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో చెత్త లేకుండా చేయమని మంత్రి నారాయణకు చెప్పానని చంద్రబాబు తెలిపారు. ఇప్పటి వరకూ

వివరాలు 2లో..

## కేంద్రం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తా

- పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచేందుకు భారత్ చర్యలు
- విదేశాలకు వెళ్లనున్న అఖిలపక్ష ఎంపీల బృందాలు
- పాక్ ఉగ్రవాద చర్యలను అంతర్జాతీయంగా బహిర్గతం చేయడమే లక్ష్యం

వివరాలు 2లో..



## మరోసారి మానవత్వం చాటుకున్న అనిత



- విశాఖలోని తాడిచెట్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదం
- అచేతన స్థితిలో ఉన్న యువకుడిని గమనించి కాన్వాయ్ ఆపించిన అనిత
- తక్షణమే ఆసుపత్రికి తరలించాలని పోలీసులకు ఆదేశం

వివరాలు 2లో..

## నా హత్యకు కుట్రపన్నాడు: ఎఫ్‌బీఐ మాజీ అధికారిపై ట్రంప్ ఫైర్

- జేమ్స్ కోమీ తన హత్యకు కుట్ర పన్నారని ట్రంప్ ఆరోపణ
- '86 47' కోడ్‌తో కోమీ ఇన్‌స్టా పోస్ట్... ఆ తర్వాత డిలీట్
- కోమీ ఒక "బ్యాడ్ కాప్" అని ట్రంప్ ఘాటు విమర్శ

పెన్ పవర్ డెస్క్:ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ జేమ్స్ కోమీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. తనను హత్య చేసేందుకు కోమీ కుట్ర పన్నారని, ఇందుకోసం కోడ్ భాషలో బెదిరింపులకు పాల్పడ్డారని ట్రంప్ ఆరోపించారు. తాజాగా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జేమ్స్ కోమీ ఒక 'బ్యాడ్ కాప్' (చెడ్డ పోలీసు అధికారి) అని ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

వివరాలు 2లో..



## మీకు అనవసరం.. దూరంగా ఉండండి

- ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణపై స్టార్మర్ అల్టిమేటంపై మాస్కో ఆగ్రహం
- కాల్పులు ఆపకపోతే పుతిన్ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్న స్టార్మర్
- స్టార్మర్ బెదిరింపులు బాధ్యతారహితమన్న రష్యా రాయబార కార్యాలయం
- శాంతి చర్చల్లో బ్రిటన్‌కు సంబంధం లేదని స్పష్టం చేసిన రష్యా
- గతంలో చర్చలను అడ్డుకున్నది లండనేనని మాస్కో ఆరోపణ

వివరాలు 2లో..



## నీట్ పరీక్ష ఫలితాలకు బ్రేక్.. స్టే విధించిన మద్రాస్ హైకోర్టు

- నీట్ యూజీ 2025 ఫలితాల విడుదలకు బ్రేక్
- మద్రాస్ హైకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు
- మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ కూడా తాత్కాలిక నిలుపుదల
- పరీక్షా కేంద్రంలో కరెంట్ కోతపై విద్యార్థుల పిటిషన్
- జూన్ 2కు విచారణ వాయిదా వేసిన మద్రాస్ హైకోర్టు



పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2025 ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే విధిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..

## దేశంలో మొదటిసారిగా తడి చెత్త, పొడి చెత్త సేకరణను తెనాలి మున్సిపాలిటీ ప్రారంభించడం గర్వకారణం

- తెనాలిలో వివిధ కార్యక్రమాలను పరిశీలించిన మంత్రి నాదెండ్ల
- ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్న వైనం
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:భారతదేశంలో మొట్టమొదటిసారిగా తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు సేకరణను తెనాలి మున్సిపాలిటీ ప్రారంభించడం గర్వకారణం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సంకల్పంలో భాగంగా ఈరోజు తెనాలిలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో కలిసి చేపట్టారు.

వివరాలు 2లో..

## వైసీపీని నాశనం చేయడమే చంద్రబాబు లక్ష్యం

- లేని మద్యం స్కామ్ లో జగన్ ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్న భూమన
- ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీని నాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తోందని, చంద్రబాబు అప్రజాస్వామిక

వివరాలు 2లో..



## టర్కీకి భారత్ డెస్టినేషన్ వెడ్డింగ్ షాక్.. రూ. 770 కోట్ల మేర దెబ్బ



పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న టర్కీకి భారత్ నుంచి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయులు 'బాయ్‌కాట్ టర్కీ' నిరసన చేపట్టారు. ఈ ప్రభావం టర్కీ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా 'డెస్టినేషన్ వెడ్డింగ్స్' ద్వారా ఆ దేశం ఆర్జించే ఆదాయంపై తీవ్రంగా పడనుంది. ఈ పరిణామాల వల్ల టర్కీ దాదాపు 90 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయాన్ని నష్టపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.గత కొంతకా లంగా విదేశాల్లో వివాహాలు

వివరాలు 2లో..

- పాకిస్థాన్‌కు టర్కీ మద్దతుతో భారతీయుల ఆగ్రహం
- టర్కీలో భారతీయ వివాహ వేడుకలు తగ్గుముఖం
- సుమారు 90 మిలియన్ డాలర్ల ఆదాయం కోల్పోనున్న టర్కీ
- 'బాయ్‌కాట్ టర్కీ' నినాదంతో వెనక్కి తగ్గుతున్న పర్యాటకులు
- వ్యాపార, వాణిజ్య సంబంధాలపైనా ప్రభావం

## చంద్రబాబు నిజాయతీగా ఇళ్లు నిర్మించుకున్నారు... మీలా బెదిరించి వసూలు చేసిన డబ్బుతో కాదు

- చంద్రబాబుపై వైసీపీ విమర్శలు
- తెలియకుండా ఇంకెన్ని ఆస్తులు కూడబెట్టారోనంటూ ట్వీట్
- 11 సీట్లు ఇచ్చినా మీ వక్రబుద్ధి మారలేదన్న మంత్రి సుభాష్

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు కు టుంబంపై వైసీపీ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా చేసిన ఆరోపణలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కౌంటర్ ఇచ్చారు. ముఖ్యమంత్రి



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# జెండా వదిలేశారా?

వైసీపీ లో కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలు కామ్ అయిపోయారు. గత ఏడాది కాలం నుంచి వారు వైసీపీలో ఉన్నారా? లేదా? అన్న సంశయం ప్రతి ఒక్కరిలోనూ కలుగుతుంది. 2019 ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గం నుంచి నంబూరి శంకరరావు, వినుకొండ నియోజకవర్గం నుంచి బొల్లా బ్రహ్మనాయుడులు ఎన్నికయ్యారు. అలాగే తెనాలి నియోజకవర్గం నుంచి అన్నాబత్తుని శివకుమార్ కూడా వైసీపీ నుంచి 2019 ఎన్నికల్లో గెలిచారు. ఇక దెందలూరు నుంచి అబ్బయ్య చౌదరి, గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి వల్లభనేని వంశీలు ఎన్నికయ్యారు. గత వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కమ్మ సామాజికవర్గం నుంచి కొడాలి నానికి మాత్రమే కేబినెట్ లో చోటు దక్కింది.

**మౌనంగానే ఉంటూ..**

అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వైసీపీలో ఉన్న కమ్మ సామాజికవర్గం నేతలందరూ మౌనంగానే ఉన్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న మర్రి రాజశేఖర్ కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇక నంబూరి శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, అన్నాబత్తుని శివకుమార్ ల అడ్రస్ కూడా దొరకడం లేదు. మైలవరం నుంచి గెలిచిన వసంత కృష్ణ ప్రసాద్ పార్టీ మారి వెళ్లిపోయారు. మిగిలిన వారు పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగానే ఉంటున్నారు. గుంటూరు కార్పొరేషన్ లో వైసీపీ బలం ఉన్నప్పటికీ టీడీపీ మేయర్ పదవిని సొంతం చేసుకుంటున్నా మాజీ ఎమ్మెల్యేలుగా వీరు చేసిన ప్రయత్నాలు శూన్యమనే చెప్పాలి. కనీసం పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలకు కూడా కమ్మ సామాజికవర్గం నేతలు దూరంగా ఉంటున్నారు.

**నేతల డైలమా....**

దెందులూరు నియోజకవర్గంలోనూ అబ్బయ్య చౌదరి పెద్దగా యాక్టివ్ గా లేరు. అక్కడ చింతమనేని దెబ్బకు బయటకు కూడా రావడం మానుకున్నారు. ఒకరకంగా వీరిని కమ్మ సామాజికవర్గం ప్రజలు వెలివేసినట్లే కనపడుతుంది. వారు నియోజకవర్గంలో తిరగడానికి కూడా ఇష్టపడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వరసగా పోసాని కృష్ణమురళి, వల్లభనేని వంశీలను అరెస్ట్ చేయడంతో కొంత కమ్మ సామాజికవర్గం నేతలు డైలమాలో పడినట్లే కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అమరావతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటం, తమ వైసీపీ ప్రభుత్వం రాజధానిని పట్టించుకోకపోవడంతో ఆ ఎఫెక్ట్ సొంత సామాజికవర్గం నుంచి పడుతుందని వారు అంచనా వేస్తున్నారు. అందుకే దూరంగా ఉండాలని, నాలుగేళ్లకు ముందే బయటకు వచ్చినా ప్రయోజనం లేదని భావించిన నేతలు తర్వాత చూద్దాంలే అన్న ధోరణిలో ఉన్నట్లనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో తాము పోటీ చేసినా వైసీపీ నుంచి గెలవడం కష్టమేనని భావించి కొందరు రాజకీయాలకు కూడా గుడ్ బై చెప్పనున్నారు.

# టర్కీకి భారత్ డెస్టినేషన్ వెడ్డింగ్ షాక్.. రూ. 770 కోట్ల మేర దెబ్బ

- మొదటి పేజీ తరువాయి

చేసుకోవాలనుకునే భారతీయ సంపన్నులకు టర్కీ ఒక ప్రధాన ఆకర్షణగా మారింది. అక్కడి ఇస్తాంబుల్‌లోని చారిత్రక రాజభవనాలు, అందమైన సముద్ర తీర ప్రాంతాలు నూతన వధూవరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో 2018లో కేవలం 13 భారతీయ జంటలు టర్కీలో పెళ్లి చేసుకోగా, గత ఏడాది నాటికి ఈ సంఖ్య ఏకంగా 50కి చేరింది. ప్రముఖ వెడ్డింగ్ ప్లానింగ్ సంస్థ కెస్టోన్ ఉత్సవ్ సీనియర్ ప్రతినిధి నిఖిల్ మహాజన్ మాట్లాడుతూ "భారత్ నుంచి డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం టర్కీకి వెళ్లే వారి ద్వారా ఆ దేశ పర్యాటక రంగానికి ఏటా సగటున 140 మిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తోంది" అని తెలిపారు. సాధారణంగా ఒక్కో వివాహానికి సగటున 3 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 25 కోట్లు) వరకు ఖర్చవుతుందని, కొన్ని సందర్భాల్లో ఇది 8 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 68 కోట్లు) వరకు కూడా ఉంటుందని అక్కడి గణాంకాలు తెలియజేస్తున్నాయి. పెళ్లికి హాజరయ్యే అతిథులు స్థానికంగా పర్యటించడం వల్ల కూడా టర్కీకి అదనపు ఆదాయం సమకూరుతోంది. అయితే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు 'ఆపరేషన్ సిందూర్' సమయంలో టర్కీ బహిరంగంగా మద్దతు ప్రకటించడం భారతీయుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. దీంతో దేశవ్యాప్తంగా 'బాయ్‌కాట్ టర్కీ' నినాదం ఊపందుకుంది. ఇప్పటికే దాదాపు 2,000 మంది భారతీయ పర్యాటకులు తమ టర్కీ పర్యటనలను రద్దు చేసుకున్నారు. ఈ ఏడాది టర్కీలో వివాహం చేసుకోవడానికి సుమారు 30 భారతీయ జంటలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.

కానీ ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో వీరంతా ప్రత్యామ్నాయ వివాహ వేదికలను ఎంచుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనివల్ల టర్కీ సుమారు 90 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 770 కోట్లు) ఆదాయాన్ని కోల్పోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నిరసన పర్యాటకం, వివాహాలకే పరిమితం కాలేదు. టర్కీతో వ్యాపార సంబంధాలను కూడా భారతీయులు క్రమంగా తగ్గించుకుంటున్నారు. పండ్లు, ఆభరణాల వ్యాపారులు టర్కీ నుంచి దిగుమతులను నిలిపివేయాలని నిర్ణయించుకున్నారు. అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) కూడా టర్కీ కంపెనీలతో ఎలాంటి వ్యాపార సంబంధాలు పెట్టుకోవద్దని పిలుపునిచ్చింది.

## చంద్రబాబు నిజాయతీగా ఇళ్లు నిర్మించుకున్నారు... మీలా బెదిరించి వసూలు చేసిన డబ్బుతో కాదు

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు కుటుంబ సభ్యులు నిజాయతీ గా వ్యాపారం చేసి, సక్రమంగా పన్నులు చెల్లించి సంపాదించిన సొమ్ముతోనే ఇళ్లు నిర్మించుకున్నారని స్పష్టం చేశారు. మీలాగా, వ్యాపారం చేసుకునే వాళ్లను బెదిరించి వసూలు చేసిన డబ్బులతో కాదు అని వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజలు మీ దరిద్రం పోతుంది అని 11 సీట్లు ఇచ్చారు... కానీ మీ వక్ర బుద్ధి మాత్రం మారలేదు" అంటూ ఆయన ఎద్దేవా చేశారు. అంతకుముందు వైసీపీ చంద్రబాబుపై విమర్శలు చేసింది. చంద్రబాబు రెండు ఎకరాల ఆస్తితో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఒక మహల్, హైటెక్ సిటీ, కొండాపూర్ ప్రాంతాల్లో ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారని ఆరోపించింది. కుప్పంలో మరో భారీ మహల్ నిర్మాణం మొదలుపెట్టారని, ఇప్పుడు తాజాగా అమరావతి నడిబొడ్డున 5.16 ఎకరాల విస్తీర్ణంలో మరో భారీ రాజమహల్ నిర్మిస్తున్నది మీరు కాదా?" అని వైసీపీ ప్రశ్నించింది. ఆయన రాజమహల్ లాంటి భవనాల్లో నివసిస్తూ, ప్రజల ముందు మాత్రం తాను నిరుపేదనని, పూరి గుడిసెలో ఉంటున్న వ్యక్తిలా మాట్లాడతారని వైసీపీ ఎద్దేవా చేసింది.

## అక్టోబర్ 2 నాటికి చెత్త లేని పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

- మొదటి పేజీ తరువాయి

55 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగించారని, రోడ్డుపై చిన్న కాగితం ముక్క కూడా వేయకుండా బాధ్యతగా వ్యవహరించే దేశం జపాన్... మనమూ దీన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**రాయలసీమలో ఫ్యాక్షన్‌కు తావులేదు, పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట**

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెకిలించామని గుర్తుచేసిన చంద్రబాబు, భవిష్యత్తులో కూడా సీమ గడ్డపై ఫ్యాక్షన్ అనే మాటే వినిపించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాయలసీమను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని హరిత ఇంధన కేంద్రంగా (గ్రీన్ ఎనర్జీ హబ్) తీర్చిదిద్దుతామని, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి సీమను కేంద్రంగా మారుస్తామని తెలిపారు. ఓర్వకల్లు, కొప్పర్తిలో రూ.5 వేల కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు కానుందని వెల్లడించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమకు గేమ్ ఛేంజర్ అవుతుందని, లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు అనేక పరిశ్రమలు తీసుకువస్తామని అన్నారు. సీమలోని నాలుగు జిల్లాల్లో విమానాశ్రయాలు, జాతీయ రహదారుల అనుసంధానం తమ ప్రభుత్వ చొరవతోనే సాధ్యమయ్యాయని గుర్తు చేశారు.

**స్వచ్ఛాంధ్ర - పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత**

ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని, మన ఇల్లు, పరిసరాలతో పాటు పల్లెలు, పట్టణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. వ్యర్థాల పునర్వినియోగం (రీసైక్లింగ్) ప్రాముఖ్యతను వివరించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, కడపలోనూ ఏర్పాటు చేస్తున్నాము. డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామాల్లో ప్రజా చైతన్యం తీసుకురావాలని, చెత్త సేకరణ, కంపోస్ట్ తయారీ బాధ్యతలను వారికి అప్పగిస్తామని చెప్పారు. 'పల్లె పుష్కరిణి' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులను శుభ్రపరిచి, వాటి చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తామన్నారు. 2026 మార్చి నాటికి రాష్ట్రాన్ని వంద శాతం ఓడీఎఫ్ ప్లస్‌గా మార్చడమే లక్ష్యమన్నారు.

## మీకు అనవసరం.. దూరంగా ఉండండి

- మొదటి పేజీ తరువాయి

ఉక్రెయిన్‌తో 30 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలని, శాంతి చర్చలకు నిరాకరిస్తే అధ్యక్షుడు పుతిన్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చేసిన హెచ్చరికలపై రష్యా తీవ్రంగా స్పందించింది. స్టార్మర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రష్యా, యుద్ధాన్ని మరింత ఉద్ధృతం చేసేలా యూకే వ్యవహరిస్తోందని ఆరోపించింది. పుతిన్ ను మీరు బెదిరించలేరు... ఇది మీకు సంబంధం లేని విషయం... దూరంగా ఉండండి అని స్పష్టం చేసింది. ఈ మేరకు లండన్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. స్టార్మర్ చేసిన బెదిరింపులను 'బాధ్యతారహితమైనవి'గా రష్యా అభివర్ణించింది. అసలు శాంతి చర్చల ప్రక్రియలో బ్రిటన్ ప్రత్యక్ష భాగస్వామి కాదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడం ద్వారా, గతంలో జరిగిన శాంతి చర్చలను అడ్డుకోవడం ద్వారా లండన్ నిరంతరంగా సంఘర్షణను రెచ్చగొడుతూనే ఉందని మాస్కో ఆరోపించింది. బ్రిటన్ అనుసరిస్తున్న రెచ్చగొట్టే ధోరణులు ఆ దేశానికే నష్టం కలిగిస్తాయని, దౌత్యపరమైన ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని రష్యా తన ప్రకటనలో పేర్కొంది. ఇటువంటి వ్యాఖ్యలు ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులను మరింత జటిలం చేస్తాయని, శాంతి స్థాపనకు ఏమాత్రం దోహదపడవని స్పష్టం చేసింది. తమపై వస్తున్న ఆరోపణల ద్వారా బ్రిటన్ తన తప్పును తానే అంగీకరిస్తున్నట్లుగా ఉందని రష్యా వ్యాఖ్యానించింది.

## వైసీపీని నాశనం చేయడమే చంద్రబాబు లక్ష్యం

- మొదటి పేజీ తరువాయి

పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను కూడా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారన్న కక్షతోనే నిజాయతీపరులైన కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిలపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేశారని భూమన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. ఎక్కడా జరగని మద్యం కుంభకోణాన్ని సృష్టించి, అందులో జగన్‌ను ఇరికించి అరెస్ట్ చేయాలనే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు కేసులతో పాలన సాగించాలని చూస్తే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిజాయతీపరులైన అధికారులను జైళ్లకు పంపడం ద్వారా చంద్రబాబు సర్కార్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రతీకార చర్యలతో అధికారుల్లో ఆందోళన నెలకొందని ఆయన తెలిపారు.

## దేశంలో మొదటిసారిగా తడి చెత్త, పొడి చెత్త సేకరణను తెనాలి మున్సిపాలిటీ ప్రారంభించడం గర్వకారణం

- మొదటి పేజీ తరువాయి

స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం 7 గంటలకు తెనాలి పట్టణం బుర్రిపాలెం రోడ్ లోని శివాజీ చౌక్ వద్ద నుండి బయలుదేరి రాముల వారి గుడి మీదుగా మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ వరకు మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది చేపడుతున్న వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి నాదెండ్ల పరిశీలించారు. అవ్వ తాత, అమ్మ ఎలా ఉన్నారు అంటూ మంత్రి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.. తెనాలి పట్టణం బండమూడి వారి వీధి లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి స్వయంగా సైడ్ కాలువలోని చెత్తను తొలగించారు. మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ మరియు చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద నుండి శ్రీ కొడాలి వీరయ్య మున్సిపల్ పార్క్ మీదుగా రావి టవర్స్ వరకు మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో అందరం కలిసికట్టుగా చేసే స్వచ్ఛంద కార్యక్రమం అన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య పై అవగాహన పెంచుకోవాలని... మన గ్రామం మన పట్టణం స్వచ్ఛంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరు ఈ డ్రైవ్ లో పాలుపంచుకోవాలన్నారు. అందరం కలిసికట్టుగా మన పట్టణాన్ని, మన నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. పట్టణంలోని డంపింగ్ యార్డ్ ను సంవత్సరాల నుంచి నిర్లక్ష్యంగా వదిలేశారని, దాన్ని అక్కడ నుంచి తరలించేందుకూను ప్రతిరోజు 75 నుంచి 95 మెట్రిక్ టన్నుల తడి పొడి చెత్త విడివిడిగా సేకరించి, తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు.ప్రజల సమస్యలు తెలుసుకునే ఉద్దేశ్యంతో ప్రతి వారంలో ఒక్కో సచివాలయం పరిధిలో అధికారులు ఇంటింటికీ వెళ్లాలని, వారికి మార్గదర్శనం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

## మరోసారి మానవత్వం చాటుకున్న అనిత

పెన్ పవర్ డెస్క్:ఏపీ హోం మంత్రి అనిత మరోసారి మానవ త్వాన్ని చాటుకున్నారు. విశాఖలో ఎయిర్ పోర్టుకు వెళుతుండగా... తాడిచెట్లపాలెం జంక్షన్ దగ్గర రోడ్డు ప్రమాదంలో గాయపడి అచేతనంగా పడిపోయిన ఒక యువకుడిని గమనించారు. వెంటనే తన కాన్వాయ్ ని ఆపించి, సహాయక చర్యలు చేపట్టారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని పోలీసులను ఆదేశించారు. ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ ఓ వృద్ధురాలికి ధైర్యం చెప్పారు.

## కేంద్రం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తా

పెన్ పవర్ డెస్క్:పాకిస్తాన్‌పై దౌత్యపరమైన యుద్ధాన్ని కొనసాగించేందుకు భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుం ది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్తాన్‌పై మరింత ఒత్తిడి పెంచే లక్ష్యంతో, అఖిలపక్ష ఎంపీల బృందాలను విదేశాలకు పంపాలని నిశ్చయించింది. ఈ బృందాలు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించి, ఆ దేశ నిజస్వరూపాన్ని బహిర్గతం చేయనున్నాయి.ఈ మేరకు మొత్తం ఏడు బృందాలను ఏర్పాటు చేయగా, అన్ని పార్టీలకు చెందిన ఎంపీలకు వీటిలో స్థానం కల్పించారు. మే 22, 23 తేదీల్లో ఈ బృందాలు విదేశాలకు బయలుదేరనున్నాయి. ఈ బృందాలు యూకే, ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించనున్నాయి. తెలంగాణ నుంచి ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి కూడా ఒక బృందంలో చోటు దక్కింది. ఆయన బీజేపీ నేత బైజయంత్ జే పాండా నేతృత్వంలోని బృందంలో సభ్యుడిగా వ్యవహరించనున్నారు. ఈ బృందంలో నిశికాంత్ దుబే, ఫంగ్నోన్ కొన్యాక్, రేఖ శర్మ, సత్నామ్ సింగ్ సంధు, గులాం నబీ ఆజాద్ కూడా ఉన్నారు. వీరు యూకే, ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించనున్నారు. ఈ అవకాశంపై అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ, "ఇది దేశానికి సంబంధించిన ముఖ్యమైన బాధ్యత. పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతిస్తున్న తీరును అంతర్జాతీయ సమాజానికి వివరిస్తాం. కేంద్ర ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడానికి నా వంతు కృషి చేస్తాను. అంతర్జాతీయ స్థాయిలో పాక్ నిజస్వరూపాన్ని బయటపెడతాం" అని తెలిపారు. ఈ పర్యటన పార్టీలకు అతీతమైనదని, బయలుదేరే ముందు మరింత వివరణాత్మక సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## నీట్ పరీక్ష ఫలితాలకు బ్రేక్.. స్టే విధించిన మద్రాస్ హైకోర్టు

- మొదటి పేజీ తరువాయి

దీంతో త్వరలో విడుదల కావాల్సిన ఫలితాల ప్రక్రియ నిలిచిపోయింది.వివరాల్లోకి వెళితే, మే 4వ తేదీన జరిగిన నీట్ యూజీ 2025 పరీక్ష సందర్భంగా ఒక పరీక్షా కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఈ వివాదానికి కారణమైంది. సరైన వెలుతురు లేకుండానే పరీక్ష రాయాల్సి వచ్చిందని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ 13 మంది విద్యార్థులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పరీక్ష నిర్వహణ ప్రక్రియ, దాని నిజాయతీ, సమగ్రతపై వారు పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, నీట్ యూజీ 2025 ఫలితాల విడుదలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది.ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇండోర్ బెంచ్ కూడా నీట్ ఫలితాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. దీంతో దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఫలితాలపై ఆందోళన నెలకొంది.

## నా హత్యకు కుట్రపన్నాడు: ఎఫ్‌బీఐ మాజీ అధికారిపై ట్రంప్ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

జేమ్స్ కోమీ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో '86 47' అనే కోడ్‌ను పోస్ట్ చేసి, ఆ తర్వాత దానిని తొలగించారు. ఈ కోడ్‌కు "అమెరికా 47వ అధ్యక్షుడిని చంపడం" అనే అర్థం వస్తుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ, "ఆ కోడ్ అర్థం జేమ్స్ కోమీకి కచ్చితంగా తెలుసు. నన్ను హత్య చేయాలనేది అతని ఉద్దేశమని స్పష్టమవుతోంది. కోమీ సమర్థుడు కాకపోవచ్చు, కానీ ఆ కోడ్ అర్థం చేసుకునేంత తెలివి అతనికి ఉంది. దేశాధ్యక్షుడిని చంపాలని కోమీ పిలుపునిచ్చాడు" అని విమర్శించారు.అయితే, ఈ ఆరోపణలపై జేమ్స్ కోమీ స్పందించారు. తాను బీచ్‌లో షెల్స్ చిత్రాన్ని పోస్ట్ చేశానని, అధికారులు దానిని హింసాత్మక అర్థం చేసుకున్నారని తెలిపారు. ఆ సంఖ్యలను హత్యలకు ఉపయోగిస్తారనే విషయం తనకు తెలియదని, అమెరికా అధ్యక్షుడిని చంపాలనే ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. అనవసర ఆరోపణలు రావడంతోనే పోస్ట్‌ను డిలీట్ చేసినట్లు కోమీ వివరణ ఇచ్చారు. కోమీ పోస్ట్‌పై అమెరికా సీక్రెట్ సర్వీస్ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ తెలిపారు. ఇప్పటికే సీక్రెట్ సర్వీస్ అధికారులు కోమీని ప్రశ్నించినట్లు అక్కడి మీడియా వర్గాలు పేర్కొన్నాయి.కాగా, గతంలోనూ డొనాల్డ్ ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. గత ఏడాది ఎన్నికల ప్రచారంలో పెన్సిల్వేనియాలో దుండగుడి కాల్పుల్లో ట్రంప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఫ్లోరిడాలో గోల్ఫ్ ఆడుతుండగా ఓ వ్యక్తి తుపాకీతో ఫెన్సింగ్ వద్దకు రావడం, మరో సమావేశం సమీపంలో ఏకే-47తో ఓ వ్యక్తిని అరెస్టు చేయడం వంటి ఘటనల నేపథ్యంలో ట్రంప్‌కు భద్రతను భారీగా పెంచారు. తాజా పరిణామాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. దోమలు, వీధి కుక్కల సమస్య లేకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గతంలో ఇంటి నిర్మాణం కోసం 50,000 నుంచి 3 లక్షల రూపాయలు ఇచ్చి ఇబ్బంది పడుతున్న లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్టులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించడం జరుగుతుందన్నారు. ముంపు ప్రాంతాల్లో వర్షాకాలానికి ముందు చర్యలు తీసుకోవాలని, రోడ్ల నిర్మాణం సైడ్ కాలువలు నిర్మాణ పనులు ప్రారంభించమన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

## వికలాంగుల సమస్యల్ని పరిష్కరించండి మేడం గారూ!

**పొదిలి ఎంపీడీవోకు దివ్యాంగుల సంఘం నాయకుల వినతి**



**పొదిలి, పెన్ పవర్, మే 17**

సమాజంలో కష్ట సాధ్యంగా జీవనం సాగిస్తున్న దివ్యాంగుల పట్ల కనికరం చూపించి, వారి సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు ముల్లా మదార్ కోరారు శనివారం నాడు ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈదర విజయలక్ష్మిని కలసి వినతి పత్రాన్ని అందజేశారు దివ్యాంగులకు ఎస్సీ బీసీ మైనారిటీ తదితర కార్పొరేషన్లలో సబ్సిడీతో కూడిన రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆయన కోరారు రుణాల కేటాయింపులో జీవో నెంబర్ 43 ప్రకారం ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన ఎంపీడీవోను విన్నవించుకున్నారు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న దివ్యాంగుల పట్ల కొన్ని బ్యాంకుల అధికారులు వారి ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని మదర్ వలి ఎంపీడీవో విజయలక్ష్మి దృష్టికి తీసుకుని వెళ్లారు దివ్యాంగు ఉపాధి ద్వారా జీవనాన్ని సాగించేందుకు అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# బీట్ ద హీట్ కార్యక్రమం పై అవగాహన

## - పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా













**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 17**

వేసవి కాలంలో వడ దెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా బీట్ ద హీట్ అనే అంశంతో ఈ రోజు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శనివారం ఉదయం కొత్తపట్నం మండలం, అల్లూరు గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. తొలుత అల్లూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రంను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్ట్ తొట్టెలను, కేంద్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి రోజు డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమం ఏ విధంగా జరుగుచున్నది, ఎంతమంది సిబ్బంది వున్నారు, సేకరించిన చెత్తను ఏ విధంగా తడి చెత్త, పొడి చెత్తగా వేరుచేస్తున్నారు, తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి, జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నెలకు ఎంత జీతం ఇస్తున్నారు, హెల్త్ కార్డ్స్, ఇన్సూరెన్స్ ఉందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటి తొట్టెను, ఏర్పాటుచేసిన కంపోస్ట్ పిట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో భాగం గా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు నుజిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్ తో స్వర్ణ ఆంధ్ర %--% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీట్ ద హీట్ అనే అంశంతో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో, పట్టణాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వేసవి కాలంలో వేడి గాలులు వలన ఎవరు వడదెబ్బ కు గురి కారాదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ బీట్ ద హీట్ అనే అంశంతో ఈ రోజు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వేసవిలో హీట్ స్ట్రోక్ తగలకుండా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుచున్నదన్నారు. వైద్యులు సూచించిన విధంగా వేసవిలో హీట్ స్ట్రోక్ తగలకుండా అవసరమైన ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని, అలాగే మహిళలందరూ చిన్న చిన్న మొక్కలతో రూఫ్ టాప్ గార్డెన్లను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రముఖ రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్స్ ఏర్పాటుచేసుకోవాలని, బిల్డింగ్‌లపై చల్లదానికి కూల్ వైట్ పెయింటింగ్ చేసుకోవడం, చలివేంద్రాల ఏర్పాటు చేయడం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంటలు ఏర్పాటుచేయడం, మొక్కలు నాటడం వంటి ఉష్ణోగ్రతను తగ్గించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుచున్నదని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం వైద్యశిబిరాలు ఏర్పాటుచేయడం జరుగుచున్నదని, ప్రజలు ఈ మెడికల్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రత కలిగిన గ్రామంగా తీర్చిదిద్దేలా డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమం పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించి చెత్తను ఎరువుగా మార్చడానికి చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మండలంలో ఒక గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి విజువల్ క్లీన్ విలేజ్ గా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని, అల్లూరు గ్రామాన్ని కూడా విజువల్ క్లీన్ విలేజ్ గా తీర్చి దిద్దేలా గ్రామస్థులు కృషి చేయాలన్నారు. ఈ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద అనేక పనులు చేపట్టడం జరుగుచున్నదని కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామంలో ఉన్న నీటి వనరులను పటిష్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో గ్రామంలో ఉన్న చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి, ఎంపిటిసి శాంతారావు, వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఉద్దేశ్యాన్ని , ఆయా శాఖల ద్వారా క్షేత్ర స్థాయిలో జరుగుచున్న కార్యక్రమాల వివరాలను వివరించారు. అనంతరం, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నంబూరు సూర్య నారాయణ, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, తహసీల్దార్ మధుసూదన్ రావు, ఎంపిడిఓ క్రిష్ణ, ఈఓ ఆర్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## కోరిక కోర్కెలు తీర్చేతల్లి

# గంగమ్మ భవాణి

**ఘనంగా గంగమ్మ తల్లి తిరునాళ**

**ఎంపీటీసీ సభ్యులు చెరుకూరి సతీష్, రావి రాజా ఆద్వర్యంలో ఎమ్మెల్యే ఉగ్ర ఘన సత్కారం**



**పీసీపల్లి పెన్ పవర్ మే 17**

పాటలే ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి తిరునాళ్ళ శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. పోలవరం సర్పంచ్ రావి రాజా , తన వర్గీయులు ఏర్పాటు చేసిన చేసిన విద్యుత్ ప్రభ భక్తులను ఆకట్టుకుంటుంది. గంగమ్మ తల్లి తిరునాళ సందర్భంగా పోతవరం గ్రామానికి చెందిన విద్యుత్ ప్రభ దగ్గరకు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోతవరం గ్రామానికి చెందిన రావి రాజా, ఎంపీటీసీ సభ్యులు చెరుకూరి సతీష్ కుమార్ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి ఉగ్ర నరసింహారెడ్డి కి ఆ కలియుగ దైవం ఉగ్రరూపం దాల్చిన ఉగ్ర నరసింహా స్వామీ ఫోటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ పాటలేటి గంగమ్మ తల్లి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి గంగమ్మ భవాణి అన్నారు. అమ్మవారి కరుణా,కటాక్షాలు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజల పై ఉండాలని , ఎప్పటివలె మంచి వర్షాలు కురిసి పాడి పంటలు పండి సిరిసంపదలతో నియోజకవర్గ ప్రజలు తూలతూగాలని కోరుకుంటున్నానని అన్నారు. సుమారు లక్షా యాభై వేలకు పైగా జనం అమ్మవారి తిరునాళ్ళ కు హాజరైనట్టు అంచనా వేశారు. వేలాది మంది భక్తులు గంగమ్మ తల్లి ని దర్శించుకోని, పొంగళ్ళు పెట్టి మొక్కలు తీర్చుకున్నారు.



# ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యం

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -120 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ

**కందుకూరు పెన్ పవర్, మే 17**

ఉగ్రవాదాన్ని అంతం చేయడం లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించిందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా కందుకూరు పట్టణంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ జాతీయ జెండా తో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం నుండి ర్యాలీగా అంకమ్మ గుడి, పోస్ట్ ఆఫీస్ సెంటర్, అంబేద్కర్ కూడలి మీదగా ఆర్టీవో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే తో పాటు ర్యాలీలో పాల్గొన్న ప్రజలు జాతీయ జెండాలు చేత పట్టుకొని బోలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో దేశభక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ తిరంగా ర్యాలీ చేపట్టడానికి గల ముఖ్య ఉద్దేశం ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి అర్పించి దేశభక్తిని పెంపొందించటమని ఎమ్మెల్యే తెలిపారు.దేశ సమైక్యత సౌభ్రాతృత్వం ప్రతిబింబించేలా ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని, ఆపరేషన్ సింధూర్ చేపట్టడం ద్వారా భారత సైనికుల సాహసాన్ని ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం దృఢతను ప్రజలకు తెలియజేస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశ భద్రతపై మన నమ్మకం మరింత బలపడిందని పేర్కొన్నారు. అనంతరం ఆర్డిఓ ఆఫీస్ వద్ద అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ కు అశ్రునివాళి అర్పించారు. ఈ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిటికిటి వెంకటేశ్వర్లు, కందుకూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాద్, జొన్నాదుల రాఘవయ్య, ఉన్నం భాస్కరరావు, జనసేన నాయకులు మదన్, హరిని ప్రజా వైద్యశాల డాక్టర్ మల్లికార్జున, టిడిపి నాయకులు చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, ఉన్నం వీరా స్వామి, షేక్ రూబీ, షేక్ సలాం, కొత్తూరు వెంకట సుధాకర్, చక్క కేశవులు, మురారి శెట్టి సుధీర్, చిరంజీవి రెడ్డి, మాదాల మాల్యాద్రి, కాకుమాని ప్రవీణ్, కల్లూరి శైలజ, ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు, బిఆర్ అక్స్ఫర్డ్ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.









# గంగమ్మ తల్లి తిరుణాలలో వైకాపా నేతలు





**పీసీపల్లి పెన్ పవర్ మే 17**

పీసీపల్లి మండలం వెంగళాపురం గ్రామంలో వెలసియున్న శ్రీ పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్ళ శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. సందర్భంగా జిల్లాలోని వైకాపా ముఖ్య నేతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైకాపా పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విధ్యుత్ ప్రభ వేదిక పై వారు ప్రసంగిస్తూ గంగమ్మ తల్లి చల్లని ఆశీస్సులు ప్రజల పై ఉండాలనీ కోరుకుంటూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన ఈ కూటమి ప్రభుత్వం తీరు పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు సూపర్ సిక్స్ హామీలిచ్చి నేరవేర్చకుండా మోసం చేసారని మండిపడ్డారు.అందుకే కూటమి ప్రభుత్వం పై 11 నెలల్లోనే ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. మళ్ళీ వైసీపీ అధికారంలోకి వచ్చి జగనన్న ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సస్యశ్యామలంగా, సుబిక్షంగా ఉంటుందన్నారు. వైసీపీ హయాంలో కులమతాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాయని నేడు అధికారం లో ఉన్నా కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలు, మహిళలు గురించి పట్టించుకునే వారు లేరన్నారు..రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని,ప్రభుత్వం కొనుగోలు చేయకుండా అన్నదాతలను నిలువున మోసం చేసిందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాని ముందుకు వచ్చి అండగా నిలబడే నాయకుడు నారాయణ అని, కనిగిరి నియోజకవర్గం వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరి ఆశీస్సులు దద్దాల నారాయణ యాదవ్ మీద ఉంచాలని వచ్చే ఎన్నికల్లో దద్దాల నారాయణ యాదవ్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు..ఈసారి అధికారం లోకి వచ్చాక జగనన్న 2.0 లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని ఎన్ని కష్టాలోచ్చిన మనమంతా సమిష్టి కృషితో మళ్ళీ జగనన్న సీఎం చేసుకోవాలన్నారు. అనంతరం కనిగిరి వైయస్ఆర్ సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ అతి సామాన్యుడైన, మీలోఒకడినైనా నాకు జగనన్న నన్ను గుర్తించి 2024 లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారని,మీరందరూ ఉన్నారని ధైర్యంతో పోటీచేయడం జరిగిందన్నారు.. ఓడిపోయినప్పటి నుండి ప్రతి గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తూ మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానాలకు మీరందరికి శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేస్తున్నానని అన్నారు..రాబోయే మూడున్నర సంవత్సరాలు అందరం కలిసికట్టుగా జగనన్న కోసం కష్టపడి పనిచేసి ముఖ్యమంత్రి చేసుకొంటే జగనన్న 2.0 లో ప్రతి ఒక్క కార్యకర్తకు,వైసీపీ సైనికులకు న్యాయం జరుగుతదని ఈ సభాముఖంగా అన్నారు . పారీ మీద, జగనన్న మీద అభిమానంతో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసిన వైసీపీ నాయకులకు, కార్యకర్తలు అందరికీ ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల ఎంపీపీలు,జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మరియు జిల్లా, నియోజకవర్గం వివిధ అనుబంధం విభాగాల అధ్యక్షులు,మండల, గ్రామస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 10 క్వింటాళ్ల బియ్యం అందజేత



**పీసీపల్లి పెన్ పవర్ మే 17**

మండలంలోని పెద్ద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామ శివారులో వెలసి యున్న శ్రీ పాలేటి గంగమ్మ తల్లి తిరుణాల శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు దేవస్థానం తరుపున గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బద్దెల మాలకొండా రెడ్డి (డీలర్) కుమారులు లక్ష్మణ్ రెడ్డి, బద్దెల వేణుగోపాల్ రెడ్డి లు 10 క్వింటాళ్ల బియ్యాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమానికి బియ్యం అందజేసిన బద్దెల మాలకొండా రెడ్డి కుటుంబాన్ని పాలేటి గంగమ్మ తల్లి కరుణ కటాక్షాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు.

## వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 17**

వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు.శనివారం కలెక్టరేటులో ఏర్పాటుచేసిన చలివేంద్రము, వైద్య శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ , డి.ఆర్.వో. బి.చిన ఓబులేసులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అత్యవసరమైతే తప్ప ఎండ వేళల్లో బయటకు రావద్దని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంక్షన్లో ద్విచక్ర వాహనాలు ఆగినప్పుడు ప్రజలు ఎండ వేడిమికి గురి కాకుండా షేడ్ నెట్స్ ఏర్పాటు చేశామన్నారు. వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. డీహైడ్రేషన్ కు గురికాకుండా చూసుకోవాలని, గాలి ఆడే దుస్తులు ధరించాలని సూచించారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డిఆర్ఓ రక్తపోటు, మధుమేహ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెంట్లు, ఉద్యోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## నూతన పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్‌కు శుభాభినందనలు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 17**

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ గా నియమితులైన డాక్టర్ కామేపల్లి సీతా రామయ్య ను ఒంగోలు మెడికల్ కా కెమిస్ట్ - డ్రగ్గిస్ట్ రిటైల్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ గా ఒంగోలు లోని ప్రముఖ సూపర్ స్పెషాలటీ ఆసుపత్రి వెంకట రమణ నర్సింగ్ హోం ఎండీ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య నియామకం బ్యాంకు అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్ ను కలిసిన సభ్యులు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ టౌన్ ప్రెసిడెంట్ జి.వెంకా రెడ్డి, కోశాధికారి వై. ఏడు కొండలు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కొల్లా మధు, జిల్లా ఈసీ సభ్యులు రఘు రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నృసింహ సేవలో ఎమ్మెల్యే ఇంటూరి

### భక్తులకు అందుతున్న సౌకర్యాలపై స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే





**వలేటివారిపాలెం పెన్ పవర్ మే 17**



ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన మాలకొండ లో వెలిసియున్న శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి జయంతి ఉత్సవం సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆంధ్ర రాష్ట్ర మరియు తమ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. వేకువజామున దర్శన భాగ్యం అనంతరం భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆయనే స్వయంగా పరిశీలించారు. భక్తుల సౌకర్యాలు ఏర్పాట్ల విషయంలో అధికారులు అశ్రద్ధ వహించవద్దని సూచించారు. సాంప్రదాయిక దుస్తుల్లో భక్తులను పలకరిస్తూ ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక ఆకర్షణగా కనిపించారు. జయంతి ఉత్సవాలు సందర్భంగా చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అల్పాహార శాల వద్ద భక్తులకు ఏర్పాటు చేసిన పలహారాన్ని ఇంటూరి నాగేశ్వరరావు తో కలిసి వితరణ చేశారు.

## పోకూరు గ్రామంలో "హీట్ ద బీట్" కార్యక్రమం





**వలేటివారిపాలెం పెన్ పవర్ మే 17**

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర బాగంగా కార్యక్రమంలో భాగంగా "హీట్ ద బీట్" కార్యక్రమం శనివారం పోకూరు గ్రామంలో నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ నరేంద్ర దేవ్ వేసవిని తట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పశువుల కోసం నీటి తొట్టెల్లో నీళ్లు నింపాలన్నారు. వృద్ధులు పిల్లలు బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా ఉండాలని చెప్పారు. ఎండల పెరుగుతున్నందున అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పార్టీ నాయకులు నవులూరి సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 19 వ రోజుకు చేరిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మె



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మే 17**

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పని చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లలో పని చేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మె శనివారం 19వ రోజుకు చేరింది. తమకు న్యాయం చేయాలని, తమ డిమాండ్లపై చర్చించేందుకు చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించాలని వారు నినాదాలు చేశారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఏపీయంసీఏ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ శ్రమకు తగిన వేతనం ఇవ్వడంలేదని వాపోయారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు వేతనం 40 వేలు అని చెప్పి 25 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. 40 వేతనం అమలు పేపర్లకు పరిమితమైందన్నారు.ఎస్ఆర్ఎస్ నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కు మినహాయింపు కల్పించాలన్నారు. జీతం లో 23 శాతం ఇంక్రిమెంట్ వెంటనే కల్పించాలని కోరారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ గా గ్రామీణ, కొండా ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రకాశం జిల్లా పరిధిలో 538 మంది వరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 85% మహిళలు పనిచేస్తున్నారని, గ్రామీణ,కొండ ప్రాంతాలలో మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు భద్రత లేకుండా పోయిందని పేర్కొన్నారు. అలాగే కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారు కొత్తగా ఇచ్చిన సర్కులర్లో హెడ్ క్వార్టర్స్ లో ఉండి రాత్రి 8 గంటలకి ఎఫ్ఆర్ఎస్ వేయాలని ఇచ్చారని, దానివలన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లకి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.. ఎవరు భద్రత కల్పిస్తారని వెంటనే 8 పియం ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దు చేయాలని కోరారు.జోన్ పోస్ట్ ల్లో వర్క్ చేయడం వల్ల వందల కిలోమీటర్లు వెళ్లి సేవలు అందిస్తున్నామన్నారు. గత ఆరు సంవత్సరాల నుంచి ప్రజా సేవ చేస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యల ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మా జీతాలు 40 వేలు అని పేపర్ కు పరిమితం అయిందని, చేతికి 24 వేల 800 రూపాయలు జీతం అందుతుందని తెలియజేశారు. తమకు 40 వేలు జీతం చేయాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వారు ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ గైడ్ లైన్స్ ప్రకారం ఆరు సంవత్సరాలు పని చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ను రెగ్యులర్ చేయాలని కోరారు. 8 పియం ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేసి కమ్యూనిటీ ఆఫీసర్ కు భద్రత రక్షణ కల్పించాలని కోరారు. ఉద్యోగుల భవిష్య నిధి అయిన పిఎఫ్ ను పునరుద్దించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్,నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఆదిల్, జిల్లా సెక్రెటరీ గంటా ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్, రామాదేవి పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర





**పొదిలి, పెన్ పవర్, మే 17**

పొదిలిలో శనివారం నాడు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా జరిగింది పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లలో ఈ కార్యక్రమాన్ని ఎంతో అట్టహాసంగా నిర్వహించారు పట్టణంలోని పాత బస్టాండు సెంటర్లో నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి, అందరినీ ఎంతో ఉత్సాహపరిచారు అలాగే అక్క చలివేంద్రంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు అలాగే మెడికల్ క్యాంపు వంటి కార్యక్రమాల్లో కూడా కమిషనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతి రావు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర







**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 17**

ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్లలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లలో శుభ్రం చేయడంతో పాటు ఆవరణ చుట్టూ ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అందువలన మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో, క్రమశిక్షణగా విధులు నిర్వర్తించవచ్చని ఒగోలు రూరల్ సిఐ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు.

## వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ**




**పీసీపల్లి పెన్ పవర్ మే 17**

వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ ఓ. ప్రభాకర్ తెలిపారు . మండలంలోని మారెళ్ళ, పీసీ పల్లి గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అత్యవసరమైతే తప్ప ఎండ వేళల్లో బయటకు రావద్దని సూచించారు. ప్రజలు ఎక్కువగా గాలాడే దుస్తులు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివై ఎంపీడీఓ రాంప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, వెలుగు సిసిలు, వైద్యశాఖ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను ఆకస్మిక తనిఖీ డి.ఎల్.డి.వో శ్రీనివాసులు రెడ్డి




**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 17**

చంద్రశేఖరపురం మండలంలోని కె అగ్రహారం గ్రామములో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను మండల ప్రత్యేక అధికారి మరియు డిఎల్ డి వో శ్రీనివాసులు రెడ్డి ఏపీవో శ్రీనివాసనాయక్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కె అగ్రహారం గ్రామంనకు చెందిన వ్యవసాయ రైతు బాలయ్య పొలంలో జరుగుతున్న ఫారం పాండ్ పనిని పరిశీలించారు. పరిశీలన చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధికూలీల హాజరు తనిఖీ చేశారు. మస్టర్ ప్రకారం వేతనదారుల వివరాలను, జాబ్ కార్డు నెంబర్లను పనులు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల తో మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన మెజర్మెంట్, కొలతల ప్రకారం పనిచేసి అత్యధిక వేతనము 307 రూపాయలు పొందేలా కనీసం నాలుగు గంటలు పనిచేయాలని తెలిపారు, అలాగే పని వేళలు ఉదయం ఆరు గంటల లోపు పని స్థలానికి చేరుకుని 10 గంటల వరకు పని చేసి వేతనం పొందాలని, పనికి హాజరు కానీ వారికి హాజరు వేయటం, ఒకరి బదులు ఒకరు రావటం,18సంవత్సరాల లోపు పిల్లల్ని పనికి రానివ్వటం వంటి తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అత్యధికముగా నమోదు అవుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఉపాధి కూలీలకు అందుబాటులో ఓ ఆర్ స్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఎంసెట్ పరీక్షలలో యర్రగొండపాలెం పేరు నిలపెట్టాలి

**తహసీల్దార్ మంజునాదరెడ్డి**



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ మే 17**

విద్యలోరాణించి త్వరలో జరగబోయే ఎంసెట్ పరీక్షలలో ర్యాంకులు సాధించి యర్రగొండపాలెం పేరును నిలపెట్టాలని తహసీల్దార్ మంజునాదరెడ్డి అన్నారు.పట్టణంలో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ ను అయన శనివారం సందర్శించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ మంజునాదరెడ్డి మాట్లాడుతూ వెనుకపడిన యర్రగొండపాలెం నియెజకవర్గంలో విద్యార్థిని విద్యార్థుల కోసం, వారికి విద్యలో ప్రోత్సాహం అందించించడం కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. 45రోజుల పాటు తరగతులకు 60మంది నిత్యం హాజరు అవడం, వారిలో ఉన్న విద్య తృష్ణా కనపడుతుందని అన్నారు. స్వచ్ఛాందసేవ సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. అనంతరం విద్యార్థులను ఎంసెట్ కోచింగ్ గురించి అడిగితెలుసుకుని వారికి ముందస్తు బెస్ట్ అఫ్ లక్ తెలిపారు. ఈకార్యక్రమంలోనిర్వాహకులు సంస్థ చైర్మన్ సంద్రపాటి విజయకుమార్, సిబ్బంది ఎ, నాగార్జున, జి వి చెన్నయ్య, ఎన్ అంజలీ, శేషరావు, కోటేశ్వరి, లను అభినందనలు తెలిపారు,యస్సి, ఎస్టీల మానిటరింగ్ కమిటీ మెంబెర్ ఎం, మరియాబాబు, ఆర్ ఎంపి వైద్యులు లక్ష్మయ్య, విజ్ఞాన్ కళాశాల డైరెక్టర్ సంపత్ లు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య.. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మే 17**

ఈనెల 17 న ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తపోటు (బీపీ) బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగి పోతుందని, చాలా మందికి బీపీ ఉందన్న విషయం తెలుసుకునే లోపే దీని వల్ల కలిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయ వాలు దెబ్బతింటున్నాయని ఆయన అన్నారు. 120/80 ఉంటే సాధారణ బీపీగా లెక్కిస్తారని, ఇటీవల చిన్న వయస్సులోనే దీని బారిన పడుతున్నవారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతోందని, ప్రజలకు అవగాహన కలిగించానికి యన్.సి.డి. కార్యక్రమం క్రింద ప్రతిరోజు గృహ సందర్శనల ద్వారా 18 సంవత్సరాల పై బడినవారికి రక్తపోటు ఉన్నచో వారికీ ప్రాథమిక చికిత్సను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధముగా ప్రతి గ్రామమంలో 104 వాహనము ద్వారా అందించు సేవలను ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధిక రక్తపోటు ఉన్నవారు ఇటీవల సర్వజన ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన గుండె జబ్బుల వైద్య విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు గుండె సంబంధిత వ్యాధుల నుండి రక్షణ పొందవలసినదిగా కోరారు. అధిక రక్తపోటు ఉన్నవారిని సమీపంలోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి లేదా ఏరియా ఆసుపత్రికి పంపి సత్వర చికిత్సను అందించడం జరుగుతుందని తెలిపారు. అధిక రక్తపోటు వలన వంద మందిలో 20 మందికి కిడ్నీలు పాడవుతున్నాయని, బీపీ ఉన్న వారు వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరి చేరదని అన్నారు. బీపీ ఉన్న ప్రతి ఒక్కరూ ముందస్తుగా కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటించాలని, బీపీ, షుగర్లు అదుపులో లేకపోతే కిడ్నీలు దెబ్బతింటాయని, వాటి పనితీరు క్షీణిస్తున్న కొద్దీ క్రియా టిన్ పెరగడం, రక్తపోటు అదుపులో లేకపోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భగీరథ, యన్.సి.డి నోడల్ అధికారి , రాజేష్ అకౌంటెంట్,మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## పొదిలిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో అట్టహాసంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర



**పొదిలి, పెన్ పవర్, మే 17**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి ఈదర విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నాడు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి తనతో పాటు కార్యాలయం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు అంతేగాక పక్షుల కోసం మట్టి పిడతల లో నీటి నీ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి తో పాటు ఈ ఓ ఆర్ డి శోభన్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

**పొదిలి మండల తహసిల్దార్ కృష్ణారెడ్డి**



**పొదిలి, పెన్ పవర్, మే 17**

ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి హెచ్చరించారు ఆయన మండలంలోని ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించారు అందులో భాగంగా శనివారం నాడు మండలంలోని దాసళ్ళపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు భూమిని పరిశీలిం చి , అక్కడి ఆక్రమణలను తొలగింప చేశారు ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా కబ్జా చేస్తుంటే, అటువంటి సమాచారాన్ని ప్రజలు తమకు అందించాలని తాసిల్దార్ కృష్ణారెడ్డి కోరారు.

## అక్రమంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు



**పొదిలి, పెన్ పవర్, మే 17**

రోడ్డు నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా తిరుగుతున్న వాహనాలపై అధికారులు కేసులు నమోదు చేశారు శనివారం నాడు దర్శి రోడ్డు ప్రాంతంలో మోటారు వాహనాల ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ మరియు పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్ రావు లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు ఈ సందర్భంగా రోడ్డు నియమ నిబంధనలను అతిక్రమించి తిరుగుతున్న ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలను, వాటి డ్రైవర్లను తనిఖీలు జరిపి, కేసులు నమోదు చేయడంతో పాటు పెనాల్టీలు విధించారు ఈ సందర్భంగా మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్, ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్రావు లు మాట్లాడుతూ ప్రయాణానికి అనుకూలంగా లేని వాహనాలలో ప్రజలు ప్రయాణించడం ఎంతో ప్రమాదకరమన్నారు అటువంటి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించవద్దని వారు సూచించారు అన్ని విధాల సౌకర్యవంతంగా ఉండే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో శ్రేయస్కరమని వారు చెప్పారు.

## పొదిలి మునిసిపల్ కమిషనర్‌ను కలసిన ఆకిబ్ అహ్మద్

**పొదిలి, పెన్ పవర్, మే 17**

పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి ని లాల్ ఫౌండేషన్ సేవా సంస్థ చైర్మన్ ఎం ఏ ఆకీబ్ అహ్మద్ కలిశారు శనివారం నాడు కమిషనర్ నారాయణరెడ్డిని మునిసిపల్ కార్యాలయంలో ఆకిబ్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు అలాగే కమిషనర్ నారాయణరెడ్డిని శాలువాతో సత్కరించి, స్వీట్స్ ప్యాకెట్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో అకీబ్ అహమ్మద్ తోపాటు ముల్లా జిలాని, ఖాదర్ భాష తదితరులు కూడా పాల్గొన్నారు.



## ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని విద్యాశాఖమంత్రికి వాట్సప్ ద్వారా వినతలు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 17**

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి వాట్సఅప్ ద్వారా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వినతులు చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ సి యస్ పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు , జె యస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ తెలియజేశారు. ప్రతి గ్రామంలో 1 నుంచి 5 తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాల ఉండే విధంగా చర్యలు గైకొనాలని , విద్యార్థుల సంఖ్య తో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం కోసం తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలను కొనసాగించాలని, ఎస్ జి టి లకు పి ఎస్ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించాలనీ, ఉన్నత పాఠశాలలలో 1 నుంచి 5 తరగతులు విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలనీ, ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండవ సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వాట్సాప్ ద్వారా వినతి పత్రాలు పంపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి మల్లికార్జున రాజు, డి పున్నమ్మ, ఎలికా శ్రీనివాసులు, టి రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండలో మజ్జిగ పంపిణీ



**వలేటివారిపాలెం పెన్ పవర్ మే 17**

మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సహకారంతో దేవస్థానానికి వచ్చిన భక్తులకు 2000 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల పట్ల బ్యాంకు వారికి ఉన్న ప్రేమాభిమానాలను భక్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సురేష్ కుమార్, సిబ్బంది నాగేశ్వరరావు, చంద్ర తేజా, రాజశేఖర్ మరియు రాజేశ్వరి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సియస్‌పురం సచివాలయంలో స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమం

**పారిశుద్ధ్య సాధన దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు**



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 17**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు చంద్రశేఖరపురం సచివాలయం లో పంచాయతీ కార్యదర్శి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశు ద్ధ్య సాధన దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మనము పనిచేసే ప్రదేశంలో పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది మాత్రమే కాకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు కృషి చేయాలని తెలిపారు. ప్రతినెల మూడో శనివారం ప్రభుత్వ ఆదేశం మేరకు కార్యాలయ ఆవరణలో మరియు గ్రామాలలోని ప్రాంతాలను పరిశుభ్రం చేసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అన్నారు అలాగే ఇంటిని చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి . గాంధీజీ కలలుగన్న పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ కోసం మనవంతు కృషి చేయాలని అన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర సంకల్పానికి కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి గ్రామంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్చార్జి యన్. సి. మాలకొండయ్య , బొబ్బూరి రమేష్, క్లస్టర్ ఇంచార్జిలు బత్తుల వెంకటాద్రి, కోనంగి వెంకటకొండయ్య మరియు ప్రసాదు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండలో మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్







**వలేటివారిపాలెం పెన్ పవర్ మే 17**

ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే కందుకూరు వైసీపీ పార్టీ ఇంచార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బుర్రా మధుసూదన్ యాదవ్ కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి జయంతి సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషం గా ఉందన్నారు. అలాగే నృసింహ స్వామి కరుణా కటాక్షాలు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు లక్ష్మి నరసింహ, తోకల కొండయ్య, గంగిరెడ్డి, గుత్తా గోపి, ఇరపని అంజయ్య, చప్పిడి రాధాకృష్ణ, టెంకం ప్రసాద్, టెంకం కొండలరావు , నలమోతు చంద్రమౌళి వైసీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరులైన విప్లవ వీరులకు లాల్ సలాములు



**ఆర్ సి ఇంచార్జ్ యర్రగొండపాలెం పెనపవర్ మే 17**

కమ్యూనిజం ఆశయాలకోసం ఉద్యమాలలో పనిచేసి చివరి శ్వాస వరకు ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన అమరులకు లాల్ సలామూలని పలువురు అన్నారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అమరులైన విప్లవ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. శనివారం మహిళా మండలి అధ్యక్షురాలు గోరంట్ల మల్లేశ్వరి 8వ వర్ధంతి సందర్భంగా స్థానిక యర్రగొండపాలెం లోని సీనియర్ జర్నలిస్టు జీపీ వెంకటేశ్వర్లు నివాసం నందు సంతాప సభ నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు జీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు పార్టీ లో చేరి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. మహిళా మండలి అధ్యక్షురాలిగా ఎన్నో సేవలు అందించారని అన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి. గురునాధం మాట్లాడుతూ అక్షర ప్రకాశం కార్యక్రమాలలో పాల్గొని నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మహిళలను చైతన్యవంతులుగా చేశారని అన్నారు. మద్య నిషేధం నివారించెందుకు ఉద్యమాలలో పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తల పట్ల వినయవిదేయలతో గృహిణి గా ఎంతోమందికి తమ ఇంటికి వచ్చిన వారికి భోజనం పెట్టి ఆకలి తీర్చారని. అనంతరం ప్రభుత్వ ఉద్యోగిగా చేరి ఎంతోమందికి వైద్య సేవలు అందించారని, తను పని చేసిన పలుచోట్ల ప్రజల చేత మంచి పేరు పొంది అందరి మన్నన అందుకున్నారని అన్నారు.ఆమె సేవలు నియోజకవర్గ పార్టీ సభ్యులు కొనియాడారు. క్యాన్సర్ వ్యాధితో చనిపోవటం పట్ల పార్టీ కి, కుటుంబానికి తీరని లోటని అన్నారు. ముందుగా ఆమె చిత్రపటానికి బందువులు, పార్టీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యర్రగొండపాలెం లో విశేష సేవలు అందించి అమరులైన బొట్లపల్లి ఇబ్రహీం, కొర్రపోలు పోలయ్య, నక్కా గాలెయ్య, గుర్రం చిన్న వెంకట స్వామి, గాలి సుబ్బారాయుడు, తాడి నాసరయ్య, యరజర్ల సాంబయ్యలను,వారి సేవలను గుర్తు చేసుకొని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, యర్రగొండపాలెం మండల కార్యదర్శి సాంబశివరావు, వైసీపీ సీనియర్ నాయకులు కె జానకి రఘు, కె.కోటిరెడ్డి, ఆకుల నారాయణ, బంకా శ్రీనివాసరావు, పిడికిటి వెంకటనారాయణ, గుంటూరు శ్రీను, పి తిరుమలయ్య, నక్కా తిరుపతయ్య, బిందు మిత్రులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద రాజుపాలెం గ్రామ టిడిపి నూతన కమిటీ ఎన్నిక

**డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు**



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 17**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చంద్రశేఖరపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ( వెంగయ్య ) ఆధ్వర్యంలో మండలం లోని పెదరాజుపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షులుగా ధనెంకుల మాల కొండయ్య, ఉపాధ్యక్షులుగా దర్శి అది నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ధనెంకుల నాగ సుభాష్, బూత్ కన్వీనర్లుగా అట్లూరి హేమలత, తెల్ల గొర్ల సుబ్బరాయుడు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ నాగిశెట్టి చిన మాలకొండయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొబ్బూరి రమేష్, అట్లూరి రామకృష్ణంరాజు, యూనిట్ ఇన్చార్జిలు బత్తుల వెంకటాద్రి, కోనంగి వెంకట కొండయ్య, కోటగిరి ప్రసాద్, ధనెంకుల నాగరాజు ధనెంకుల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ హర్షిణి.. ఉద్యోగాల వర్షిణి

**- ప్రాంగణ ఎంపికలలో 32 మంది శ్రీ హర్షిణి విద్యార్థులు ఎంపిక**

**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ మే 17**

శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం నాడు సియట్,హెట్రో కంపెనీల వారి ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలలో మొత్తం 32 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సియట్ కంపెనీలో 2.4 లక్షల ప్యాకేజీ తో 24 మంది ఎంపికయ్యారు. హెట్రో కంపెనీలో 2.8 లక్షల ప్యాకేజీ తో 8 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్స్ ను కూడా నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ హర్షిణి అని తెలియజేశారు. దీనికి కారణం కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుండి కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీ చేరిన విద్యార్థికి కాంపిటేటివ్ ఎగ్జామ్స్ దృష్టిలో ఉంచుకుని, క్యాంపస్ ప్లేస్మెంట్స్ కు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ మొదటి సంవత్సరం నుండి డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు.ఎంపిక కాబడిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి 100% ప్లేస్మెంట్స్ లక్ష్యంగా శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల



ప్రారంభించడం జరిగినదని తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు, పీజీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇంచార్జ్ ధీరీష్, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## చలివేంద్రం ఏర్పాటు చేసిన ఆర్.కె.వలి గూడంశెట్టి రవికుమార్

**చంద్రశేఖరపురం,పెన్ పవర్ మే 17**

చంద్రశేఖరపురం మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ఎక్కువగా రద్దీ గా ఉండే కూడలిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలువ పందిరినీ నిర్మించి కూలింగ్ వాటర్ డబ్బాలతో ఉచిత మంచినీటి కేంద్రాన్ని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్ కె వలి,మండల జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ శ్రీ నారాయణస్వామి దేవస్థానంనకు వచ్చే భక్తులు మరియు పామూరు, సి యస్ పురం వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు మరియు అనేక ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామస్తులు మరియు ఇతర గ్రామస్తులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆర్కే వలి, గూడంశెట్టి రవి ని పలువురు అభినందించారు.

# ధిక్కార కవి కలేకూరికి నీలి నివాళి

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 17**

సమాజంలో ఉన్న అసమానతలపై తన ధిక్కార భావజాలాన్ని తన కలం ద్వారా ప్రజల హృదయాల్లోకి సంధించిన ప్రజా కవి కలేకూరి ప్రసాద్ అని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి. అశోక్ బాబు అన్నారు. శనివారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్ లో మాల ఉద్యోగుల సంఘం, మాల జేఏసీ ఆధ్వర్యంలో ధిక్కార కవి కలేకూరి ప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నీలి వందనాలు, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు టి. అశోక్ బాబు మాట్లాడుతూ ఈ దేశంలో ఆడవాళ్ళ మీద అత్యాచారాలపై, అగత్యాలపై, తను రాసినటువంటి "కర్మభూమిలో పూసిన పువ్వా, యావత్ ఉమ్మడి రాష్ట్రాన్ని కదిలించిందని, కృష్ణాజిల్లాలో పుట్టినా ఉద్యమ గడ్డ ప్రకాశం జిల్లాలో తన జీవన ప్రయాణంలో కొన్నేళ్లు ప్రకాశం జిల్లాలో గడపడం జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టం అని అన్నారు. సమాజాన్ని



జాగృతం చేసే అణగారిన వర్గాల గళం కలేకూరి అతి చిన్న వయసులోనే దళిత జాతి కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా మాలలు జేఏసీ అధ్యక్షులు కొప్పోలు ఏడుకొండలు మాట్లాడుతూ సమాజంలో రైతుల దోపిడీకి గురి అవుతున్న సందర్భంగా రాసినటువంటి "పచ్చాని చేలో రంగేసినట్టు, "పురుగుమందే పెరుగన్న మాయెర అని రైతులకి జరుగుతున్న అన్యాయాన్ని తన యొక్క పాటల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రజా విప్లవ కవి కలేకూరి అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేడికొండ లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి ప్రసాద్, గౌరవ సలహాదారులు మేడిది రవి, జిల్లా మీడియా కోఆర్డినేటర్ శాంత రావు, ఎరజర్ల రమేష్, ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శాంసన్, కోశాధికారి టి శ్రీకాంత్, మాల యువత విభాగం అధ్యక్షులు రాంబాబు, కసుకుర్తి రాజు, టి క్రాంతి, ప్రకాశం జిల్లా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్, ప్రకాశం జిల్లా మాల జేఏసీ ఆధ్వర్యంలో కలేకూరి ప్రసాద్ కి ఘన నివాళులు అర్పించారు.

# అందరి భాగస్వామ్యంతో స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛంద ప్రదేశ్ సాధ్యం

**కొమరోలు లోని గ్రామ సచివాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నమ మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి**

**స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించిన స్పెషల్ ఆఫీసర్ -మెడికల్ క్యాంపును పశువుల నీటి తొట్లను పరిశీలించిన వరలక్ష్మి**








**కొమరోలు పెన్ పవర్ మే 17**

ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు కొమరోలు గ్రామ సచివాలయాల లో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీ మూడవ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, కొమరోలు మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి, కొమరోలు మండలాధ్యక్షురాలు కామూరి అమూల్య ,తాటిచెర్ల ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరెడ్డి, కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి, ఏపీ ఓ మహాలక్ష్మి దేవి డిప్యూటీ ఎంపీడీవో డి బ్రహ్మయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు . ఆ సందర్భంగా కొమరోలు మండల స్పెషల్ అధికారి వరలక్ష్మి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత అమలుకు అందరి భాగస్వామ్యం అవసరమని అభిప్రాయపడ్డారు. కేవలం అధికారులు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలను కూడా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో తప్పనిసరిగా భాగస్వాములు చేయాలని ఆమె సూచించారు. ఆ సందర్భంగా పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బ్రహ్మయ్య స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞను చదివి చేయించగా ఆ ప్రతిజ్ఞలో ముఖ్య అతిథులతో పాటు ,మూడు గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది ,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ,అంగన్వాడి టీచర్లు, వెలుగు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి సందర్శించి పరిశీలించారు. ఆ సందర్భంగా ఆమె బిపి ,షుగర్ తదితర పరీక్షలు చేయించుకుని, మెడికల్ క్యాంపు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా మట్టి కుండలతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి గోపానిపల్లె గ్రామ సమీపంలో ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పశువులనీటి తొట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమాలలో కొమరోలు గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, జనార్దన్ రెడ్డి ,శ్రీనివాసులు,మూడు సచివాలయాల సిబ్బంది ,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు వెలుగు కార్యాలయ సిబ్బంది ,పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటరీ దొంగలు అరెస్ట్



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే17**

బోప్పూడి : గ్రామ పరిదిలోని హెచ్ పి పెట్రోల్ బంక్ వెనుక గల ఖాళీ స్థలంలో పార్క్ చేసి వున్న టిప్పర్ లారీ యొక్క రెండు బ్యాటరీలును 16.05.2025 వ తేదీ మద్యాహ్నం దొంగతనం చేసినట్లు నాదెండ్ల మండలం, గణపవరం గ్రామానికి చెందిన మలిశెట్టి శ్రీనివాసరావు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి. అనిల్ కుమార్ కేసు నమోదు చేసి రెండు గంటల వ్యవదిలో ముద్దాయిలు అయిన 1. సయ్యద్ బాబు లేటు అబ్బు ట అబ్దుల్లా, 33 సం పోలేరమ్మ గుడి వద్ద, మిలటరీ కాలనీ, ఒంగోలు పట్టణం, 2. షేక్ ఆసిఫ్ బాషా ట ఆసిఫ్ నాగూర్ మీరా వలి, 21 సం. నడిగడ్డపాలెం గ్రామం, చుండూరు మండలం, గుంటూరు జిల్లా. ప్రస్తుతం పోలేరమ్మ గుడి వద్ద, మిలటరీ కాలనీ, ఒంగోలు పట్టణం అను వారిని చిలకలూరిపేట మండలం, రామచంద్రాపురం గ్రామ పరిదిలోని ఎన్.హెచ్-16 ప్లై ఓవర్ క్రింద అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 50,000/- విలువ గల రెండు ఎక్సిడ్ బ్యాటరీలను స్వాదీనం చేసుకొన్నారు. ముద్దాయిలు ఇద్దరినీ చిలకలూరిపేట ఏ జె సి జె కోర్టులో హాజరుపర్చగా వారిని 15 రోజుల రిమాండ్ కు పంపినారు. సయ్యద్ బాబు పై ఒంగోలు తాలుకా, చీమకుర్తి, టంగుటూరు పోలీస్ స్టేషన్ లలో దొంగతనం కేసులు మరియు గంజాయి కేసు వున్నది. అదేవిధంగా ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ నందు సస్పెక్ట్ షీటు కూడా వున్నది.

## మోపిదేవిలో జరగనున్న మినీ మహానాడును జయప్రదం చేయండి

**తెలుగుదేశం శ్రేణులకు బొబ్బా విజ్ఞప్తి..**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 17**

మోపిదేవిలో ఈ నెల 19వ తేదీన జరగనున్న మినీ మహానాడును జయప్రదం చేయాలని తెలుగుదేశం నేత, పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.. శనివారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో గోవర్ధన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విజయం సాధించి కూటమి పార్టీలైన జనసేన, భారతీయ జనతా పార్టీ లతో కలలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత జరగనున్న తొలి మహానాడు కడపలో జరగనుండగా నియోజకవర్గ స్థాయిలో మోపిదేవిలో మినీ మహానాడు జరగనుందన్నారు.. వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి అయిదేళ్ల పాటు పోరాటాలు చేసిన తెలుగుదేశం కార్యకర్తల తెగువకు, పోరాట స్పూర్తికి మోపిదేవిలో జరిగే మినీ మహానాడు వేదిక కాబోతుందని గోవర్ధన్ అన్నారు.. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ఆదరాభిమానాలు పొందుతుందని, మినీ మహానాడు వేదికగా ప్రభుత్వానికి కార్యకర్తలంతా మద్దతుగా నిలవాలని గోవర్ధన్ అన్నారు.. ఇప్పటికే పార్టీ భవిష్యత్ ఆశాకిరణమైన యువనేత, రాష్ట్ర మంత్రి వర్యులు నారాలోకేష్ సంక్షేమ పథకాల క్యాలెండరును ప్రకటించారని తెలిపారు.. ఇప్పటికీ వైసీపీ నేతలు ప్రభుత్వంపై విషం చిమ్ముతూనే ఉందని వారి విషప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొడుతున్నారన్నారు.. నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా 19వ తేదీన మోపిదేవి ఎస్ విహార్ ఎదురుగా హైవే ను ఆనుకొని ఉన్న స్థలంలో జరిగే మినీ మహానాడుకు ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు హాజరవుతారని, ఆరు మండలాలకు చెందిన కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు.

# ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 100 మంది రోగులకు పరీక్షలు

**నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ.**

**శిబిరాన్ని ప్రారంభించిన ఎస్వీబీఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె పి గురువయ్య, వైద్య శిబిర ఇంచార్జ్ ఆది.**

**50 మంది రోజులకు శస్త్ర చికిత్స అవసరం ఉన్నట్లుగా గుర్తింపు.**

**25 మంది రోగులను శస్త్ర చికిత్సల కొరకు నంద్యాల శాంతిరాం ఆసుపత్రికి తరలింపు.**





**కొమరోలు పెన్ పవర్ మే 17**

నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో శనివారం కొమరోలులో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 100 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లుగా కంటి వైద్య శిబిర ఇన్చార్జి, ఆప్తలిక్ మెటరిస్ట్ ఆది తెలిపారు. కొమరోలు లోని ఎస్వీబీఎస్ డిగ్రీ కళాశాల లో ఆ కళాశాల కరెస్పాండెంట్ కేపీ గురవయ్య సహకారంతో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్ వి బి స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేపీ గురువయ్య, వైద్య శిబిరం ఇంచార్జ్ ఆది ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆప్తాలిక్ అసిస్టెంట్ దివాకర్, శిబిరం ఇంచార్జ్ ఆది రోగులకు పరీక్షలు చేశారు. 100 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా, వారిలో 50 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని ఆది తెలిపారు. అయితే సదరు 50 మందిలో 25 మంది తమ వెంట నంద్యాలకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో వారిని తమ వాహనంలో ఉచితంగా నంద్యాలకు తరలిస్తున్నట్లుగా ఆయన చెప్పారు. వారికి నంద్యాలలోని శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని కంటి విభాగంలో ఉచితంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి క్షేమంగా ఇంటికి చేరవేస్తామని ఆయన తెలిపారు. రోగులకు ఉచితంగా రాకపోకలు సౌకర్యం కలిగించడమే కాకుండా, ఆసుపత్రిలో ఐదు రోజులపాటు ఉచితంగా భోజన వసతి సౌకర్యం కల్పిస్తామని, రోగుల వెంట వచ్చే సహాయకుల కూడా ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. కంటి వైద్య శిబిరంలో శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోఆర్డినేటర్ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

**తాసిల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో**

**పరిసరాలను శుభ్రం చేసిన సిబ్బంది**




**కొమరోలు పెన్ పవర్ మే 17**

కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛందర స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు .తాసిల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, మండల సర్వేయర్ సిలార్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్లు, డి పెద్ద దేవనాయక్, రంగనాయకులు, శ్రీవిద్య, వీఆర్వోలు, వీఆర్ఏలు కలసి కార్యాలయం ప్రాంగణం కార్యాలయం చుట్టుగల చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఆ సందర్భంగా తాసిల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం అని, ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు .ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వం ఆదేశం మేరకు స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛంద ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కేవలం నెలలో మూడో శనివారం మాత్రమే కాకుండా తరచుగా కార్యాలయాన్ని, కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసుకోవడం వల్ల అందరికీ ఉపయోగకరమని అన్నారు. కార్యాలయంలోని బీరువాలను కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. తాసిల్దార్ తో పాటు కార్యాలయ సిబ్బంది స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొనడంతో కార్యాలయానికి వివిధ అవసరాలపై వచ్చిన ప్రజలు కూడా అందులో భాగస్వాములయ్యారు.

## వి వి ఎన్ -జి ఏ ఎఫ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు పెన్ పవర్ మే 17**

గిద్దలూరు పట్టణం, రాచర్ల రోడ్డులోని సెయింట్ పాల్స్ కళాశాలల ఆవరణలో, రాచర్ల మండలం, పలుగుంటిపల్లె గ్రామానికి చెందిన వెనగండ్ల వీరనారాయణ గారు నూతనంగా ఏర్పాటు చేసిన వి వి ఎన్ -జి ఏ ఎఫ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, కాంప్లెక్స్ లో "జిమ్ సెంటర్" ను, ,"స్విమ్మింగ్ ఫుల్" లను ప్రారంభించారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి వ్యాయామం తప్పనిసరి అవసరమని, నేటి యువతకు అనుగుణంగా ఆధునిక పరికరాలతో జిమ్ సెంటర్ ఏర్పాటు, స్విమ్మింగ్ ఫుల్, వాకింగ్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్, వంటి సదుపాయాల కల్పనతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయటం అభినందనీయమని మంచి ఆలోచన విధానంతో ప్రారంభించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ విజయవంతంగా ముందుకు సాగాలని శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ కళాశాలల కరెస్పాండెంట్ గోనా రంజిత్, పి ఈ టి శోభన్, జక్కరయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాలఈశ్వరయ్య, నిమ్మకాయల శేఖర్, అబ్బు ఓబయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయం

**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ మే 17**

మరమ్మత్తుల కారణంగా ఆదివారం డి-3 సెక్షన్ పరిధిలో గల మంగమూరు రోడ్డు, మర్రి చెట్టు కాలనీ, ప్రగతినగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 7 గం నుండి మధ్యాహ్నం 1 గం వరకు విద్యుత్తు సరఫరా లో అంతరాయం కలదని ఒంగోలు టౌన్ డి ఈ ఈ కె వి పాండురంగా రావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే ఇంటూరి ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ







**కందుకూరు పెన్ పవర్, మే 17:**

ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేతృత్వంలో శనివారం సాయంత్రం పట్టణం లోని ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల యాజమాన్యం వారు ఏర్పాటు చేసిన 150మీటర్ల భారీ జాతీయ జెండా తో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, డైరెక్టర్స్ బాల భాస్కర్, బెజవాడ నరేంద్ర, సిబ్బంది, విద్యార్థులు,కూటమి నాయకులు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని సైనిక దళాలకు వీర మరణం పొందిన సైనికులకు సంఘీభావం తెలిపారు.

## చిరంజీవి మేధాన్ష్‌కు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన జనసేన యువనాయకులు మండలనేని చరణ్ తేజ

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే17 :**

జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ నవతారంపార్టీ జాతీయ నాయకులు రావు సుబ్రహ్మణ్యం మనవడు మేధాన్ష్ అనే చిన్నారికి ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీలో చురుకైన యువ నాయకుడిగా గుర్తింపు పొందిన చరణ్ తేజ, రాజకీయాలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ, వారిఆనందంలోపాలుపంచుకుంటారు. ఈ సందర్భంగా చరణ్ తేజ మాట్లాడుతూ, "చిన్నారి మేధాన్ష్ పుట్టినరోజు వేడుకలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. పిల్లల చిరునవ్వులు, వారి ఆనందమే మనందరికీ మానసిక ఉల్లాసాన్ని స్ఫూర్తినిస్తాయి. మేధాన్ష్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. చరణ్ తేజ, మేధాన్ష్ తల్లిదండ్రులకు కూడా శుభాకాంక్షలు తెలుపుతూ, వారి పిల్లలను చక్కగా ఉన్నత విలువలతో పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ జనసేన కార్యకర్తలు, మేధాన్ష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగా నృసింహ స్వామి జయంతి ఉత్సవం







**వలేటివారిపాలెం పెన్ పవర్ మే 17**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి జయంతోత్సవం శుక్రవారం మరియు శనివారం ఘనంగా జరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుండి శుక్రవారం రాత్రినుంచే భక్తులు వేలాదిగా మాలకొండ కి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన సన్నిధిలో కొండ క్రింద భాగాన శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు స్వామివారి మాలధారణ ధరించిన భక్తులు కోసం శుక్రవారం రాత్రికి నిప్పులగుండం ఏర్పాటుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు వారు భారీ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. వేసవికాలం దృష్ట్యా ముందుగానే ముఖద్వారం వద్ద నుంచి దేవాలయం లోపల వరకు టెంట్లు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అంచనాతో దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు. భక్తులకు క్యూలైన్ మరియు పలు ప్రాంతాల్లో మంచి నీళ్లు మజ్జిగ పంపిణీ చేశారు . శనివారం రాత్రికి కొండ కింద మేళతాళాల మంగళవాయిద్యాల నడుమ రకరకాల పూలతో స్వామి వారిని అలంకరించి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి దాతలు అన్నదాన కార్యక్రమం కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా 18,23,562 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే వి సాగర్ బాబు తెలిపారు.

**ఎప్పటికప్పుడు పర్యవేక్షణ**

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు,ఆలయ కార్యనిర్వహణాధికారి కే వి సాగర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆలయంలో భక్తులకు అందుతున్న వసతులపై ఎప్పటికపుడు దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది కి భక్తుల పట్ల ఎలా ప్రవర్తించాలనే విషయంలో సలహాలు సూచనలు చేస్తూ ఎక్కడ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

# గిద్దలూరు రాచర్ల మండలాల్లో వర్షం

### శ్రీ నెమలిగుండ్ల రంగనాయకుల స్వామి ఆలయం సమీపంలో కూలిన భారీ వృక్షాలు







**గిద్దలూరు పెన్ పవర్ మే 17**

గిద్దలూరు ,రాచర్ల లలో శనివారం భారీ వర్షం కురిసింది . ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో భారీ చెట్లు నేల కూలి రోడ్డుకు అడ్డంగా పడటం తో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడి రంగడి దర్శనానికి వెళ్లినభక్తులు ఇబ్బందులు పడ్డారు. అయితే వెంటనే స్పందించిన రాచర్ల ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి నెలకూలిన చెట్లను తొలగించి ట్రాఫిక్ కి పునరుద్ధన చేశారు. గిద్దలూరు లో కూడా భారీ వర్షం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జల మాయమం అయ్యాయి. పట్టణం లో డ్రనేజి వ్యవస్థ సరిగాలేక పోవటంతో మురికినీరు రోడ్లపై ప్రవహించింది.

## తోట రాజారమేష్ ఆధ్వర్యంలో జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే17**

రాజకీయాలలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తకు అండగా ఉంటున్న పార్టీ జనసేనపార్టీ అని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజారమేష్ ఆధ్వర్యంలో జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని పట్టణములోని రజక కమ్యూనిటీ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాదె వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా వుంటున్నారని, నీతి నిజాయితీలతో పార్టీ నడిపిస్తున్న గొప్ప నాయకుడు అని అన్నారు. అనంతరం క్రియాశీలక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గుడ్లూరులో విజయవంతంగా బీట్ ది హీట్ కార్యక్రమం

## చలివేంద్రం ఏర్పాటు -అవగాహన ర్యాలీ నిర్వహన









**గుడ్లూరు, పెన్ పవర్, మే17:**

మండలంలోని 24 గ్రామపంచాయతీలలోనూ మరియు మండల కేంద్రమైన గుడ్లూరు నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమము అమలులో భాగంగా మూడవ శనివారము బీట్ ది హీట్ కార్యక్రమం ప్రధాన థీమ్ రాష్ట్ర ప్రభుత్వము నిర్దేశించగా వేడి గాలుల ప్రభావాలను తగ్గించడం పై ప్రజలలో ప్రచారము నిర్వహించడం మరియు అవగాహన కల్పించడానికి మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఘనంగా కార్యక్రమం నిర్వహించడం జరిగినదని ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రజలకు వేడిగాలుల నుండి అవగాహన కల్పించడం కోసం టెర్రస్ గార్డెన్స్ ద్వారా ఎండ తీవ్రతను తగ్గించుకోవడం, సోలార్ రెఫ్లెక్టివ్ పెయింట్స్ వంటివి ఇళ్ల పైకప్పులకు సిమెంటు రేకులకు పైపూతగా వేసుకోవడం ద్వారా చల్లదనాన్ని పొందడం, చలివేంద్రాలు జనసాంద్రత కలిగిన ప్రదేశాలలో ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులకు బాటసారులకు దాహార్తిని తీర్చడం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ద్వారా వర్షపు నీటిని భూమిలోనికి ఇంకింపజేసుకునే ఏర్పాటు చేసుకోవడం,చెట్లు నాటడం తద్వారా గ్రీనరీ ని పెంపొందించి రేడియేషన్ను తగ్గించుకోవడం, సన్ స్ట్రోక్స్ బారిన పడకుండా గొడుగు లేదా టోపీలు వాడడం మజ్జిగ లేదా ద్రవపదార్థాలను అధికంగా తీసుకోవడం, పక్షులు ఎండ తీవ్రతను భరించడానికి అనుకూలంగా అధికంగా నీరు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి భవనాల మీద మట్టి పాత్రలలో నీటిని ఏర్పాటు చేయడం, జంతువుల కొరకు ప్రతి గ్రామంలో 30 వేల రూపాయలతో ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల త్రాగునీటి కుంటల ద్వారా నీటి వసతిని ఏర్పాటు చేయడం, వేడిగాలుల ప్రభావాలను ఎప్పటికప్పుడు మొబైల్ యాప్స్ ఏపీ ఎస్డిఎంఎ హీట్ అలర్ట్ మరియు ఏపీ డిఐఎంఎస్) వంటి మొబైల్ అప్లికేషన్స్ ద్వారా తెలుసుకోగలగడం. తిరిగి ఉపయోగించగలిగే వ్యర్థాలను మాత్రమే వాడే విధంగా అవగాహన కల్పించడం, కొబ్బరి మట్టలు తాటి ఆకులు చలువ పందిళ్లు ఇళ్ల వద్ద మరియు జనాలు అధికంగా సంచరించే ప్రదేశాలలో ఎకో కూల్ రూఫ్ టెక్నాలజీ పై అవగాహన కల్పించడం, పోస్టర్స్ ప్లకార్డ్స్ ర్యాలీ మరియు మానవహారం నిర్వహించడం ద్వారా గుడ్లూరు మండలంలో ఉన్న ప్రజానీకం అందరికీ సంక్షేమ పథకాలతో పాటు వేసవి తీవ్రతను ఎదుర్కొనేందుకు అవసరమైన చిట్కాలు మరియు స్లోగన్స్ ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామంలోని ఇంటింటికి ఇంకుడు గుంటలు నిర్మాణం చేసుకొనడానికి అవగాహన కల్పించడానికి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఇంకుడు గుంటను ఏర్పాటు చేయడం, కిచెన్ వేస్ట్ నుండి ఎరువులు తయారు చేసుకుని ఇళ్లలోని పూల మొక్కలకు మరియు ఆకుకూరల పెంపకానికి వ్యవసాయ భూముల్లో ఉపయోగించడానికి ఎరువు తయారు చేసుకునే విధంగా కంపోస్ట్ పిట్స్ గ్రామాల్లోని ప్రతి ఒక్క ఇంటికి ఉపాధి హామీ ద్వారా మంజూరు చేయడం జరుగుతుంది కాబట్టి మోడల్ కంపోస్ట్ పిట్ ను మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో త్రవ్వించడము, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ను అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసుకునేందుకు అవగాహన కల్పించేందుకు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం, చెట్ల పెంపకం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని వేడి గాలుల ప్రభావాన్ని తగ్గించే విధంగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలియజేస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేయడం, ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో వేసవి తీవ్రతను నుండి రక్షణ పొందే విధంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. గుడ్లూరు బస్టాండ్ సెంటర్ వద్ద నాలుగు రోడ్ల కూడలి లో మానవహారం నిర్వహించి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు,మండలంలోని మండల స్థాయి అధికారులు, స్థానిక పొదుపు మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి శ్రామికులు, అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 17:**

లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వి ఆర్ కె నగర్ వారి ఆధ్వర్యంలో లయన్ నర్రా రమాదేవి సాయిబాబు లయన్స్ మల్టీ పర్పస్ సర్వీస్ సెంటర్ నందు ఉచిత నేత్ర పరీక్ష శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. డాక్టర్ వెంకటరావు 45 మంది రోగులకు పరీక్షలు చేసి 12 మందిని ఆపరేషన్ నిమిత్తం గూడూరుకు పంపించడం జరిగింది. ఈ క్యాంపును లయన్ నర్రా సాయిబాబు తన శ్రీమతి కీర్తి శేషులు లయన్ నర్రా రమాదేవి జ్ఞాపకార్థం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్యాంపును లయన్ నర్రా సాయిబాబు ,కార్యదర్శి కస్తూరి ప్రసాద్ , మాజీ అధ్యక్షులు లయన్ మోపిదేవి వెంకటేశ్వరరావు ,లయన్ ప్రసాద్, లయన్ కృష్ణారావు, లయన్ వేమూరి మురళీకృష్ణ, లయన్ కె సుధాకర్, లయన్ ఉప్పల సాంబశివరావు, మరియు లయన్ అంబటి బసవ శంకర్ రావు పర్యవేక్షణ చేయడం జరిగింది.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

## కృష్ణ జిల్లా ఏపీజీఈఏ ఆధ్వర్యంలో "చలో విజయవాడ"



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 17**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కృష్ణ జిల్లా శాఖ అధ్యక్షులు పి. రాము మరియు ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు, జూన్ నెల 5వ తేదీన విజయవాడలో జరగబోయే "చలో విజయవాడ" సమావేశానికి కృష్ణ జిల్లాలోని ఉద్యోగులు తరలి రావాలని అన్నారు. రాష్ట్ర ఏపీజీఈఏ అధ్యక్షులు కామ్రేడ్ కె.ఆర్.సూర్య నారాయణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో, బంటుమిల్లి తాలూకా ఏపీజీఈఏ నాయకులు పెడన మునిసిపాలిటీలో ప్రత్యేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. పెడన మునిసిపాలిటీ ఉద్యోగులతో పాటు, బంటుమిల్లి తాలూకాలోని గ్రామ వార్డు సచివాలయ ( జి ఎస్ డబ్ల్యూ ఎస్ ) ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నాయకులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే లక్ష్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. బంటుమిల్లి తాలూకా ఏపీజిఈఏ నాయకులు మాట్లాడుతూ, "రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ హక్కుల కోసం ఏకం కావాల్సిన సమయం ఇది. విజయవాడలో జరగబోయే ఈ చలో విజయవాడ సమావేశం ఉద్యోగులందరికీ ఒక వేదిక కానుంది. కావున, పెడన మునిసిపాలిటీ బంటుమిల్లి తాలూకాలోని జిఎస్ డబ్ల్యూ ఎస్ ఉద్యోగులందరూ ఈ సమావేశానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.



## ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే













**చీరాల,పెన్ పవర్,మే 17**

నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహ ఆవిష్కరణ మరియు టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవ చేసిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య , సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్ ,మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకులు బాచిన గరటయ్య ,జిల్లా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతరామయ్య . ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు , మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## బదిలీలకు సిద్ధమైన వేళ టీచర్ల సంఘాలు చర్చలను బహిష్కరించడం సరికాదు

**టీచర్ల సమస్యలకంటే విద్యార్థుల భవిష్యత్, అభివృద్ధి కొరకు ప్రాధాన్యత ఇవ్వాలి.**

**ఒక్కో టీచర్ కు ఒక్కో సమస్య అనేలా డిమాండ్లతో ప్రాతినిధ్యాలు సబబు కాదు.**

**అందరికీ వెబ్ కౌన్సెలింగ్ మాత్రమే అత్యుత్తమ మార్గం.**

**తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తించేలా డిమాండ్ పెట్టండి.**



**చల్లపల్లి,రిపోర్టర్,పెన్ పవర్, మే,17:**

రాష్ట్రంలో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు బదిలీలకు ఎదురు చూస్తూ జీవోలు వచ్చే సమయంలో అధికారులతో టీచర్ల సంఘాలు చర్చలను బహిష్కరించాలానే నిర్ణయం సరికాదని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. అమరావతిలో సురేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో పలుమార్లు చర్చలు జరిపారని ఆ చర్చల సారాంశాన్ని అధికారులు ఎప్పటికప్పుడు తెలియజేయడం తప్ప ఉపాధ్యాయ సంఘాలు ద్వారా టీచర్లకు తెలియ చేస్తున్న పరిస్థితులు లేవన్నారు.సంఘ నాయకుల హోదాలో పలు మార్లు చర్చలకు వెళ్ళటం,పోటీపడి అధికారులకు, ఎమ్మెల్సీ లకు వినతి పత్రాలు అందిస్తూ ఫోటోలు కోసం తాపత్రయ పడటం తప్ప చర్చల్లో సాధిస్తున్నది ఏమీ కనబడడం లేదన్నారు. డిమాండ్ల పేరుతో పదులకొద్ది సమస్యలు ఏకరువు పెట్టేకన్నా క్షేత్రస్థాయిలో మెజార్టీ ఉపాధ్యాయులు, పాఠశాలలకు చెందిన సమస్యల పరిష్కారం కోసమే సంఘ నేతలు ప్రయత్నించాలన్నారు. నాయకుల వినతిపత్రాలు ద్వారా సమర్పించే డిమాండ్లలో ఒక్కో టీచర్ కి ఒక్కో కోరిక లా ఉంటున్నాయన్నారు. బదిలీలలో సంఘ నాయకులు,వారి కుటుంబ సభ్యులకి చెందిన వారికి జరిగే లాభ,నష్టాలు ఆధా రంగా డిమాండ్లు పెట్టవద్దని,అధికారులతో పట్టు విడుపుల ధోరణితో బదిలీల ప్రక్రియ సజావుగా కొనసాగేలా చూడాలని ఉపాధ్యాయ సంఘాలను సురేష్ బాబు కోరారు. కౌన్సెలింగ్ కేంద్రాలలో రోజులకొద్దీ వేచిచూసే పని లేకుండా అందరికీ వెబ్ కౌన్సిలింగ్ మాత్రమే అత్యుత్తమ మార్గమని అన్నారు. సంఘాలు కేవలం టీచర్ల సమస్యలే కాకుండా పేదపిల్లల భవిష్యత్తు, అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తల్లికివం దనం ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు మాత్రమే వర్తించేలా సంఘాలు మొదటి డిమాండ్ గా పెట్టాలని కోరారు.

# ప్రతి ఇంటిలో మొక్కలు పెంచాలి

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి -బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర..









**పెన్ పవర బ్యూరో బాపట్ల17**

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత,పచ్చదనం,పరిసరాల పరిశు భ్రతను జీవనశైలిలో ఒక భాగంగా అలవర్చుకునే దిశగా అవగాహన పెంచుకోవాలని ఇళ్లు, పరిసర ప్రాంతాలలో మొక్కలు పెంచుట ద్వారా వాతావరణ ఉష్ణోగ్రతలు తగ్గించుటకు కృషిచేయాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలలో బీట్ ది హీట్ నినాదంతో నిర్వహించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బాపట్ల పట్టణం 9వ వార్డు చిల్లర గొల్లపాలెం, మూర్తి రక్షణ నగర లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించి మొక్కలు నాటారు. **ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ :** స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మే నెలలో వేడిని తగ్గించండి ఇతివృత్తానికి అనుగుణంగా విస్తృతంగా కార్య క్రమాలు నిర్వహించాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దివాస్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ స్థిరత్వం, సమాజ వాతావరణం స్థితిస్థాపనను ప్రోత్సహించే దిశగా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ మూడవ శనివారం వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచేందుకు మొక్కలను నాటాలని ఆయన అన్నారు. మే నెల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలుపుతుందని వృద్ధులు, పిల్లలు, కార్మికులు, బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాలు, ఇండ్ల కాలనీలో ఇతర నిర్మాణ పనులు జరుగుతున్న ఆయా ప్రాంతాలలో డ్వామా సంబంధిత శాఖల అధికారులు చలి వేంద్రాలు, షెడ్ నెట్లు ఏర్పాటు, వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు తక్కువ ఆదాయ గృహాల పైక ప్పులపై సోలార్ రిఫ్లక్టివ్ వైట్ పెయింట్లను ప్రోత్స హించడం ద్వారా ఇండోర్ ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. బౌగోళిక మార్పుల కారణంగా వాతావరణంలో విపరీతంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.ఓ గంగాధర్ గౌడ్, ఆర్.డి.ఓ. గ్లోరియా,మండల స్పెషల్ ఆఫీసర్ శివ లీల,తాసిల్దార్ సలీమా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి,బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు,ధారా అశోక్,ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ కొల్లూరి వెంకట్రావు మరియు మునిసిపాలిటీ సిబ్బంది,వార్డు ప్రజలు,కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కావలి ఎమ్మెల్యే కావ్య ఆదేశాల మేరకు రెండో పంటకు నీటిని విడుదల చేసిన కండ్లగుంట







**కావలిపెన్ పవర్ మే 17**

కావలి ఎస్వపిఎం మేజర్ డిస్ట్రిబ్యూటరీ కాలువకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రెండో పంటకు నీరు విడుదల చేసినట్టు మాజీ సమస్యల ప్రాజెక్టు చైర్మన్ కలగుంట మధుబాబు నాయుడు తెలిపారు. నీటి సంఘం అధ్యక్షులు చేతుల మీదుగా కాలువకి 30 కిలోమీటర్ల వద్ద ఎస్వీ పిఎం కాలువకు 150 క్యూసెక్కుల నీరు విధులు చేసినట్టు తెలిపారు. అనంతరం మధుబాబు నాయుడు మాట్లాడుతూ, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గెలిచిన మొదటి ఏడాది రెండవ పంటకు నీరు ఇవ్వడం గొప్ప విషయమని తెలిపారు. కావలి కాలువ 7 సంవత్సరాలుగా పూడిక తీయక నీరు చివరి వరకు రావడం కష్టతరంగా ఉండేదని ఎమ్మెల్యే కావ్య సహకారంతో కాలువ పని పూర్తి చేసుకొని కావలి కాలువ, సబ్ కాలువలకు నీటిని విడుదల చేయడం పట్ల ఎమ్మెల్యే కావ్యకు రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ. లు సత్యప్రసాద్, శరత్ కుమార్ నీటి సంఘం అధ్యక్షులు ఎర్రం. వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య, శ్రీహరి, వెంకటేశ్వర్లు,రమేష్ రెడ్డి, సన్న కారు రైతు నాయకులు, ఏ.ఇ. లు నాగార్జున, మాధవరావు, గిరి కుమార్ పాల్గొన్నారు.



పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

## వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కుంబాభిషేకం మహోత్సవంలో పాల్గొన్నకావలి ఆర్య వైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్







**కావలి పెన్ పవర్ మే 17**

కావలి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ శనివారం వైయస్సార్ కడప జిల్లా కడపలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలకు హాజరైన శృంగేరి శారద పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విధిశేఖర భారతి మహాస్వామిజీని దర్శించుకున్నారు. అలాగే పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాల స్వామీజీని దర్శించుకున్నారు. అనంతరం వారి ఆశీర్వదిచనాలు తీసుకున్నారు. కావలి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి పాలక మండలి సభ్యులు 2025వ సంవత్సరంలో ఆర్యవైశ్యుల్లోనే ఈ కమిటీ సభ్యులలో ఒకరికొకరు పొంతన లేకుండా, గందరగోళ పరిస్థితుల మధ్యన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కావలి పట్టణంలోని అనేక ప్రదేశాల్లో ఆర్యవైశ్యులలో చర్చినియాంశమైంది. అసలు కావలి పట్టణ ఆర్యవైశ్యులు ఎన్నుకున్న పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సముచిత స్థానం కల్పించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆలయానికి 10 లక్షల రూపాయల విరాళాన్ని అందించిన తటవర్తి రమేష్ని ఆహ్వాన కమిటీ తగిన విధంగా ఆహ్వానించకపోవడంతో తను ఈ కార్యక్రమానికి గైహాజరైనట్లు సమాచారం. కొసమెరుపు ఏమిటంటే అసలు ఆలయ కమిటీ ఎన్నిక అక్రమము అని కావలి పట్టణంలో ప్రచారం జోరుగా సాగుతుండం విశేషం. అంతేకాకుండా 10 కోట్ల రూపాయలు వరకు అమ్మవారిని పెట్టుకుని డబ్బులు వసూలు చేసినట్లు కూడా సమాచారం.

## ఘనంగా పాదర్తిని సత్కరించిన గుడ్లూరు ఆర్యవైశ్య సంఘం





**కావలి పెన్ పవర్ మే 17:**

జ్ఞాని జైల్ సింగ్ నేషనల్ మెమోరియల్ అవార్డు గ్రహీత డాక్టర్ పాదర్తి నాగరాజును శనివారం గుడ్లూరు ఆర్యవైశ్య సంఘ కిరణాల మర్చంట్ అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఆర్య వైశ్య ప్రముఖులు సేవా తత్పరులు అందరివాడు అమరావతి జ్యోతి, ఇజం టీవీ పాత్రికేయులు అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొందిన పాత్రికేయ రంగంలో తను చూపిన చొరవకు తను చేసిన సేవకు ఏపీజేయు ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో జ్ఞాని జైల్ సింగ్ స్మారక జాతీయ అవార్డును అందుకోవడం అభినందనీయమని బిజెపి మండల శాఖ నాయకులు ఈ సుధాకర్ నివాసములు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగాపాదర్తి నాగరాజు ను ఘనంగా శాలువా తో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘు సభ్యులు కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేసిన సత్యవాణి

### రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

**కావలి రూరల్ – పెన్ పవర్ – మే 17**

కావలి రూరల్ మండల పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీలో శనివారం రైతులకు పీఎండీఎస్ కిట్లను జె డి ఏ సత్యవాణి, వ్యవసాయ శాఖ ఏ.డి .సిహెచ్ నాగరాజు, పంపిణీ చేశారు, ఈ సందర్భంగా జె డి ఏ సత్యవాణి మాట్లాడుతూ ప్రతి రైతు పీఎండీఎస్ కిట్లను ఉపయోగించుకోవాలని కోరారు. వీటి యొక్క ముఖ్య ఉద్దేశం వేసవికాలంలోనూ రైతులకు అదనపు ఆదాయం చేకూరాలని చేకూరాలనే ముఖ్య ఉద్దేశంతో ఈరోజు రైతులకు 30 రకాల విత్తనాలను కలిగిన పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వీటిలో ముఖ్యంగా నవధాన్యాలు, చిరుధాన్యాలు కూరగాయలు, ఆకుకూరలు, మొక్కజొన్న విత్తనాలను ఇంకా పలు రకాల విత్తనాలను ఈ కిట్లలో ఉంచడం జరిగిందన్నారు. వీటి ద్వారా మెయిన్ పంట వేసేముందు 45 నుండి 55 రోజుల ముందు తొలకరి చినుకులు పడే సమయంలో చల్లడం వలన రైతుకు అదనపు ఆదాయం చేకూరుతుందని, ఈ పంట ద్వారా వచ్చు ఆకుకూరలు, కూరగాయల, నుండి ఆదాయం పొందిన తరువాత భూమిని దుక్కి చేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా భూమిలో వైవిధ్యమైన బ్యాక్టీరియా పెరగటం భూమి యొక్క కార్బన్ల లభ్యత పెరగటం జరుగుతుందన్నారు .ఈ విత్తనాల్లో తక్కువ వేర్లు మరియు ఎక్కువ వేర్లు ఉండటం వల్ల భూమి గుల్ల పారడము జరుగుతుందన్నారు. భూమికి



రసాయనక ఎరువుల వాడకం తగ్గుతుందని సూచించారు, తాళ్లపాలెంలో పిఎండిఎస్ కిట్ల కోసం 650 కేజీల విత్తనాలను తీసుకొని 65 కిట్లను తయారు చేయడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లాలో మొత్తం 80,000 వేల పిఎండిఎస్ కిట్లను పంపిణీ చేయవలసి ఉండగా దానిలో 20,000 వేల కు పైగా కిట్లను పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మధుసూదన్ రావు, పిడిఎం మాలకొండయ్య, ఎన్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రంలో డాక్టరేట్ పొందిన కావ్య

### కర్ణాటక రాష్ట్ర గవర్నర్ నుండి డాక్టరేట్ అందుకున్న కావ్య



**కావలి పెన్ పవర్ – మే 17**

కావలికి చెందిన కుమారి తొట్టెంపూడి కావ్య శుక్రవారం బెంగుళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం ( గాంధీ కృషి విజ్ఞాన కేంద్ర ) నుండి డాక్టరేట్ అందుకున్నారు. అదే విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన కావ్య, జన్యుశాస్త్రం మరియు మొక్కలపెంపకం విభాగంలో డాక్టరేట్ ను కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ నుండి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి యన్ చలువరాయస్వామి, వైస్ ఛాన్సెలర్ డాక్టర్ యస్ వి సురేఖ, ఇఫ్కో మేనేజంగ్ డైరెక్టర్ డాక్టర్ యు యస్ అవస్తి, డీన్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ డాక్టర్ కె సి నారాయణ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొట్టెంపూడి కావ్య మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తగా, రైతుల సంక్షేమానికి కృషి చేయడమే లక్షంగా, ఈ రంగంలో డాక్టరేట్ పొందానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన తండ్రి, అన్నపూర్ణ క్లాత్ మార్కెట్ లో వస్త్రవ్యాపారం చేస్తున్న, తొట్టెంపూడి ప్రసాదరావు భారతీయ మజ్దూర్ సంఘ్ ( బియంయస్ ) జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర నాయకుడిగా 4 దశాబ్దాల పాటు కార్మిక సంక్షేమం కోసం పనిచేసారని, తన తాతయ్య జి జయరామయ్య ప్రకాశం జిల్లాలో విద్యావేత్తగా, పలు విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారని అన్నారు. వారి ఆకాంక్ష మేరకు తాను సాఫ్ట్వేర్ రంగం లేదా వైద్య రంగాన్ని కాదనుకుని వ్యవసాయ శాస్త్రవేత్తగా రైతులకు, వ్యవసాయ రంగానికి తనవంతు సహకారం అందించాలని ఈ రంగాన్ని ఎంచుకున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం బాపట్లలోని యన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టీచింగ్ అసోసియేట్ గా పనిచేస్తున్నానని అన్నారు. మరింత మంది వ్యవసాయ శాస్త్రవేత్తలను దేశానికీ అందించడమే తన లక్ష్యం అని అన్నారు. తన లక్ష్యసాధనకు సహకరించిన అధ్యాపకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసారు.

## కావలిలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛంద్ర

### ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కమీషనర్.






**కావలి పెన్ పవర్ – మే 17**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడోవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కావలి పట్టణంలో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పురపాలక సంఘం కమిషనర్ జి శ్రావణ్ కుమార్, 1వ పట్టణ సీఐ యం.డి. ఫిరోజ్, 2వ పట్టణ సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో వారు సెల్ఫీ పాయింట్ వద్ద స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటడం జరిగింది. అనంతరము సెల్ఫీ పాయింట్ నుండి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ ప్రయాణికులకు మరియు ఆర్.టి.సి. డ్రైవర్లకు మజ్జిగ, ఓఆర్ఎస్, ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ మేనేజరు, టౌన్ ప్లానింగ్ అధికారి, రెవెన్యూ అధికారి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్, సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది మరియు శానిటరి మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన కోటాలో లింగమనేని

**గుంటూరు, మే 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో తెలుగు దేశం పార్టీ, జనసేనలు మంచి అవగాహనతో ముందుకు వెళుతున్నాయి. ఇకపై ఏపీలో ఖాళీ అయ్యే ప్రతి స్థానం కూటమి ఖాతాలోనే పడుతుంది. విపక్ష వైసీపీకి కేవలం పదకొండు స్థానాలు మాత్రమే రావడంతో ఇటు ఎమ్మెల్సీ, అటు రాజ్యసభ స్థానాలు దక్కే ఛాన్స్ లేదు. వచ్చిన వన్నీ కూటమి ఖాతాలోనే పడుతున్నాయి. అయితే ఇప్పటి వరకూ ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలు టీడీపీ, బీజేపీ ఖాతాలోనే పడ్డాయి. వైసీపీ నుంచి రాజీనామా చేసిన నలుగురు రాజ్యసభ పదవుల్లో రెండింటిలో తెలుగుదేశం పార్టీ, రెండింటిలో బీజేపీ దక్కించుకుంది. రాజ్యసభ స్థానాలు మాత్రం జనసేకు దక్కలేదు. అందుకే ఈ సారి ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానంలో ఒకటి జనసేన ఖాతాలో పడనుంది. జనసేనకు ఇప్పటి వరకూ రాజ్యసభలో సభ్యులు లేరు. పార్లమెంటులో ప్రాధాన్యత ఉంది కానీ, రాజ్యసభలో జనసేన ప్రాతినిధ్యం లేకపోవడంతో ఈసారి ఖాళీ అవుతున్న స్థానంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కన్నేశారని చెబుతున్నారు. వచ్చే ఏడాది జూన్ లో ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అదానీ సన్నిహితుడు పరిమళ్ నత్వాని, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, సానా సతీష్ ల రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఇందులో పరిమళ్ నత్వాన్ని స్థానంలో ఖాళీ అయ్యే రాజ్యసభ పదవిని బీజేపీకి ఇవ్వాలని నిర్ణయించారు. సానా సతీష్ కు తక్కువ కాలమే రాజ్యసభ పదవి ఉండటంతో ఆయనకు టీడీపీ నుంచి రెన్యువల్ చేసే అవకాశముంది. మరొక స్థానం మాత్రం టీడీపీ, బీజేపీలు తీసుకుని ఒకటి మాత్రం జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. జనసేనకు కేటాయించిన స్థానంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త లింగమనేని రమేష్ కు ఇవ్వాలని ముందుగానే డిసైడ్ అయినట్లు తెలిసింది. లింగమనేని రమేష్ ఇటు చంద్రబాబుకు, అటు పవన్ కల్యాణ్ కు సన్నిహితుడు కావడంతో ఆయనకు జనసేన నుంచి రాజ్యసభ పదవి ఇవ్వాలని డిసైడ్ చేసినట్లు తెలిసింది. ఎన్నికల ముందు కూటమి

ఏర్పాటులో కూడా లింగమనేని రమేష్ కీలకంగా వ్యవహరించారు. లింగమనేని రమేష్ గెస్ట్ హౌస్ లోనే చంద్రబాబు ఉంటున్నారు. అలాగే పవన్ కల్యాణ్ కు కూడా సన్నిహితుడిగా ఉండటంతో ఆయనకు పదవి ఇవ్వాలని ఫిక్స్ అయినట్లు తెలిసింది. అందుకే తన సోదరుడు నాగబాబును రాజ్యసభ పదవికి ఎంపిక చేయాలనుకుని తొలుత భావించినా లింగమనేని రమేష్ కు ఈ స్థానం రిజర్వ్ అవ్వడంతో నాగబాబుకు ఎమ్మెల్సీ ఇచ్చారంటున్నారు. మొత్తం మీద లింగమనేనిని రాజ్యసభకు పంపాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫిక్స్ అయ్యారని చెబుతున్నారు.

# దుర్గగుడిలో అడగడుగునా దోపిడీ

**విజయవాడ, మే 17, పెన్ పవర్:**
బెజవాడ దుర్గమ్మ.. ఎంతోమందికి ఆరాధ్య దైవం. అమ్మవారి దర్శనం కోసం ఏపీలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా.. వేరే రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. కానీ.. అమ్మవారి సన్నిధిలో దోపిడీ చూశాక ముక్కున వేలేసుకుంటున్నారు. కొండపైకి వెళ్లడం మొదలు.. కిందకు వచ్చేదాకా భక్తులను దారుణంగా దోచుకుంటున్నారు.విజయవాడ ఇంద్రకీలాద్రి.. ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రం. కానీ ఇప్పుడు దోపిడీకి కేంద్రంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా అక్కడ వ్యాపారులు, సిబ్బంది భక్తుల జేబులకు చిల్లు పెడుతున్నారు. కొండపైకి ఎక్కడం మొదలు.. కిందకు దిగే వరకు.. ప్రతీచోట డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అమ్మవారి కొండపైకి వెళ్లడానికి ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. కానీ.. అవి సరిపడా లేవు. ఎప్పుడో వస్తున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో.. భక్తులు వేడికి తాళలేక.. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వారధి కింద నుంచి కొండపైకి వెళ్లడానికి సెవెన్ సీటర్ వాహనాలను నడుపుతున్నారు. వీటిల్లో ఎక్కించడానికి అక్కడ విధులు నిర్వహించే ఆలయ సిబ్బంది సహకరిస్తున్నారు. అటు ఘాట్ రోడ్డు ప్రారంభంలో ఉండే సిబ్బంది కూడా.. భక్తుల వాహనాలకు ఆంక్షలు పెడుతున్నారు. కానీ.. కొండపైకి వచ్చే ప్రైవేటు వాహనాలను మాత్రం ఆపడం లేదు. వీటిల్లో ఒక్కో భక్తుడి నుంచి రూ.20 వసూలు చేస్తున్నారుఏదోలా కొండపైకి వచ్చిన భక్తులు.. అక్కడా దోపిడీకి గురవుతున్నారు. సాధారణంగా రూ.20 ఉండే వాటర్ బాటిల్‌ను రూ.30కి విక్రయిస్తున్నారు. ఇందేటని ప్రశ్నిస్తే.. ఇష్టం ఉంటే కొనుక్కో.. లేదంటే లేదు.. అని గద్దిస్తున్నారు. కూల్ డ్రింక్స్ విక్రయాల పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. కొండపైన ఫొటోలు తీసేవారు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు.గతంలో మాదిరిగా కాకుండా.. అమ్మవారి కొండపైకి ఎక్కడానికి లిఫ్ట్ ఏర్పాటు చేశారు. వృద్ధులు,



వికలాంగులు, చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులను లిఫ్ట్‌లో పైకి తీసుకెళ్లాలి. కానీ.. అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. డబ్బులు వసూలు చేసి.. లిఫ్ట్‌లో ఎక్కిస్తున్నారనే ఆరోపమలు ఉన్నాయి. ఇటు కొండపైనుంచి కిందకు దిగడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో బస్సులు సరిపోవడం లేదు. దీంతో ప్రైవేటు వాహన యజమానులు అక్కడికి వచ్చి.. భక్తులకు మాయమాటలు చెప్పి.. వాహనాల్లో ఎక్కిస్తున్నారు.ఇలా ప్రతీచోట.. భక్తులు దోపిడీకి గురవుతున్నారు. అక కొండపైకి ఎక్కాక.. గతంలో మాదిరిగా లేదు. ఏది ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. దర్శనం తర్వాత భక్తులు బయటకు రావడానికి కూడా సరైన మార్గం లేదు. లడ్డూ ప్రసాదం ఎక్కడ విక్రయిస్తారో తెలియక చాలామంది నిరాశతో వెనుదిరుగుతున్నారు. సిబ్బందిని అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు.భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తారు. ఇక్కడైతే.. మామూలు దోపిడీ లేదు. ఒక్కో భక్తుడి దగ్గర ఆలయ అధికారులు రూ.40 తీసుకొని టోకెన్ ఇస్తున్నారు. కానీ.. తీరా అక్కడికి వెళ్లాక రూ.100 ఇస్తేనే తలనీలాలు తీస్తున్నారు. ఇవ్వకపోతే.. బూతులు తిడుతున్నారు. ఆగమాగం తలనీలాలు తీస్తున్నారు. పుట్టు వెంట్రుకలు అయితే.. ఇంకా ఎక్కువ వసూలు చేస్తున్నారు.

# ఉద్యోగుల బదిలీకి మార్గదర్శకాలు...

**విశాఖపట్టణం, మే 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదలయ్యాయి. మే 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలపై ఉన్న ఆంక్షల్ని సడలించారు. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

**ఏపీలో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల**

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 2వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించిన మార్గదర్శకాలను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేశారు.ఏపీలో జూన్ 3వ తేదీ నుంచి ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మే 16 నుంచి జూన్ 2లోగా బదిలీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. తాజా బదిలీల నుంచి ఉపాధ్యాయులు, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందిని మినహాయించారు.

మే 31వ తేదీ నాటికి ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులు తప్పనిసరిగా వారు పనిచేసే స్థానాల నుంచి బదిలీ కావాల్సి ఉంటుంది. ఐదేళ్లు పూర్తికాని ఉద్యో గులు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.ఏడాదిలోపు అంటే 2026 మే 31లోపు రిటైర్ అయ్యే ఉద్యోగులను బదిలీ చేయరు. వారు ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నా ప్రస్తుత స్థానంలోనే కొనసాగిస్తారు. రిటైర్మెంట్ దగ్గర పడిన అభ్యర్థులు స్వయంగా కోరుకున్నా, పరిపాలన కారణాలతో బదిలీ చేయొచ్చు.

ఉద్యోగి బదిలీ కోసం ఒక చోట అన్ని కేడర్లలో పనిచేసిన కాలాన్నియూనిట్‌గా పరిగణిస్తారు. ఉద్యోగి పనిచేసిన నగరం, పట్టణం గ్రామంలో ఎక్కడ ఏ స్థాయిలో పనిచేసినా ఒకే యూనిట్‌గా పరిగణిస్తారు.ఒకే కార్యాలయం అనే నిర్వచనం ఐదేళ్ల నిబంధనకు వర్తించదు.

ఉద్యోగుల బదిలీల్లో కంటి చూపు సమస్యలు ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు.మానసిక వైకల్యం ఉన్న పిల్లల్ని కలిగి ఉన్న ఉద్యోగులకు వారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్న నగరం, పట్టణానికి బదిలీ కోరితే ప్రాధాన్యమిస్తారు.గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికి, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

ఉద్యోగితో పాటు , ఉద్యోగి జీవిత భాగస్వామి, వారిపై ఆధారపడిన పిల్లల్లో ఎవరికైనా క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరోసర్జరీ, కిడ్నీ మార్పిడి వంటి దీర్ఘకాలిక వ్యాధులుంటే వైద్య సదుపాయాలున్న చోటుకు బదిలీకి ప్రాధాన్యం ఇస్తారు. కారుణ్య నియామకం కింద నియమితులైన వితంతు మహిళా ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

**పదోన్నతిపై బదిలీ తప్పనిసరి**

పదోన్నతి పొందాల్సిన ఉద్యోగులు తప్పనిసరిగా ప్రస్తుత స్థానం నుంచి బదిలీ అవుతారు.బదిలీ కావాల్సిన స్థానంలో పదోన్నతికి సంబంధించిన పోస్టు లేకపోతే మాత్రమే ప్రస్తుత స్థానంలో కొనసాగుతారు.దృష్టి సమస్యలు ఉన్న ఉద్యోగులను బదిలీ నుంచి మినహాయిస్తారు.ఉద్యోగి స్వయంగా బదిలీ కోరితే, సాధ్యమైనంత వరకు వారు ఎంపిక చేసుకున్నచోట ఖాళీ ఉంటే అవ కాశం కల్పించవచ్చు. దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగు లైతే, వారిని ఒకేచోట లేదా దగ్గరగా ఉండే చోట్ల నియమించేలా బదిలీ చేయాలి.

**ఏజెన్సీలకు ప్రాధాన్యత..**

నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీలను మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీల భర్తీ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని మార్గ దర్శకాల్లో సూచించింది. ఐటీడీఏల్లో ఉద్యోగుల బదిలీలు పూర్తైన తర్వాత నాన్-ఐటీడీఏ పోస్టులు నింపాలి. ఐటీడీఏ ప్రాంతాలతోపాటు మారుమూల, వెనకబడిన ప్రాంతాల్లోని ఎక్కువ ఖాళీలున్న ప్రాంతాలకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.

ఐటీడీఏ ప్రాంతాల్లోని లోకల్, జోనల్ క్యాడ ర్లలో పనిచేసే ఉద్యోగుల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారిని ఎంపిక చేసుకున్న స్టేషన్ కు బదిలీ చేయొచ్చు. ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఏళ్లలోపు వారినే నియమించాల్సి ఉంటుంది.

ఐటీడీఏ ప్రాంతాల్లో ఇప్పటి వరకు పనిచేయని వారిని, మైదాన ప్రాంతాల్లో వాళ్ళు పని చేసిన కాలాన్ని అవరోహణ క్రమంలో పరిగణలోకి తీసుకుని ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయాలి.

ఐటీడీఏ ప్రాంతం నుంచి బదిలీ అయిన వారి స్థానంలో... బదిలీపై వచ్చే అధికారి రిపోర్ట్ చేసిన తర్వాతే వారిని రిలీవ్ చేస్తారు. నాన్ ఐటీడీఏ ప్రాంతం నుంచి ఐటీడీఏ ప్రాంతంలో పోస్టింగ్ పొందిన ఉద్యోగులు గడువులోపు రిపోర్ట్ చేయాలి. అలా చేయకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

ఉద్యోగ సంఘాల నేతలకు అవకాశం

గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు సంబంధించిన రాష్ట్ర, జిల్లా, డివిజన్/మండల స్థాయి నేతలకు మూడు టర్మ్‌లకు మినహాయింపు ఉంటుంది. ఆఫీస్ బేరర్లకు మూడు విడతలు పూర్తయ్యే వరకు లేదా ఒకే స్టేషన్లో 9 ఏళు పూర్తయ్యే వరకు కానీ బదిలీ చేయకూడదు. తాలూకా, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల జాబితా సంబంధిత కలెక్టర్ ద్వారా హెచ్‌ఓడిలకు పంపాల్సి ఉంటుంది. రాష్ట్ర సంఘం జాబితాను జీఏడీ ద్వారా మాత్రమే రాష్ట్రస్థాయి హెచ్‌ఓడీలకు పంపాల్సి ఉంటుంది.ప్రతి శాఖలో బదిలీల కోసం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసి, అభ్యర్థనలు పరిశీలించి ఉన్నతాధికారికి తగిన సిఫార్సులు చేయాలి. బదిలీ ప్రక్రియకు ఆయా విభాగాధిపతులే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. బదిలీ ప్రక్రియ పారదర్శకంగా, నిర్దేశిత కాలపరిమితిలోగా వివాదాలు, ఫిర్యాదులకు తావు లేకుండా చేయాల్సిన బాధ్యత విభాగాధిపతులపై ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ఉల్లంఘిస్తే వాటిని తీవ్రంగా పరిగణిస్తారు

## మెట్రో రైలు ప్రాజెక్టులపై ముందడుగు

**విశాఖపట్టణం, మే 17, పెన్ పవర్:** ఏపీలో మెట్రో రైలు ప్రాజెక్టులపై కీలక ముందడుగు పడింది. పలు విదేశీ బ్యాంకుల ప్రతినిధులతో మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. తక్కువ వడ్డీకి రుణం ఇచ్చే బ్యాంకులతో ఎండీ సంప్రదింపులు జరిపారు. ఈ సమావేశానికి కేఎఫ్ డబ్లు, ఏఎఫ్ డీ, ఏడీబీ, ఎన్డీబీ, ఏఐఐబీ, జైకా, వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు హాజరయ్యారు. వీరంతా విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్స్ ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విశాఖ మెట్రోకి 6వేల 100 కోట్లు, విజయవాడ మెట్రోకి 5వేల 900 కోట్ల రుణం సమీకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ లో త్వరలో రెండు మెట్రో రైల్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. దీనికి సంబంధించి విశాఖ, విజయవాడలో మెట్రో రైల్ ఏర్పాటు చేయాలని గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిపోయింది. గత ఐదేళు ఈ ప్రాజెక్ట్ గురించి ఎవరూ పట్టించుకోలేదు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మెట్రో రైల్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించి విదేశీ బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. దీంతో త్వరలో మెట్రో రైలు పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి.మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి పెట్టారు. విదేశీ బ్యాంకుల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. తక్కువ వడ్డీకి ఎవరైతే రుణాలు ఇస్తారో వారితో చర్చలు జరిపి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని ప్రాజెక్ లను పూర్తి చేయాలని భావిస్తున్నారు. మెట్రో రైలు వెళ్లే ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతానికి మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు రుణాలు ఇచ్చేందుకు %ఖఖీఔ, ఄాఖీఐ, ఄాఐదీ, చీఐదీ, ఄా××దీ, జీ×జూా%, వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.దాదాపు 1200 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. విశాఖ మెట్రో రైలుకి 6100 కోట్లు, విజయవాడ మెట్రో రైలుకి 5వేల 900 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. తక్కువ వడ్డీకి ఎవరైతే లోన్ ఇస్తారో ఆ బ్యాంక్ ద్వారా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## సమన్యాయం ఎక్కడ అంటున్న జనసైనికులు

**విజయవాడ, మే 17, ( పెన్ పవర్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదవుల విషయంలో అందరికీ సమాన న్యాయం చేయలేకపోతున్నారంటున్నారు.



కేవలం కొందరికే పదవులు దక్కడంతో మిగిలిన వారు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. పార్టీ నాయకత్వంతో టచ్ లో ఉన్నావారితో పాటు ఎంపిక చేసిన కొందరికే నామినేటెడ్ పదవులు లభిస్తున్నాయంటున్నారు. ఇప్పటి వరకూ భర్తీ అయిన పోస్టుల్లో బీసీలకు, శెట్టి బలిజ సామాజికవర్గాలకు దక్కింది తక్కువేనని అంటున్నారు. ఎక్కువగా కాపు సామాజికవర్గానికి చెందిన నేతలకే పదవులు ఇవ్వడాన్ని కొందరు తప్పుపడుతున్నారు. గత ఎన్నికల్లో అన్ని సామాజికవర్గాలు కలసి పని చేస్తేనే హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ వచ్చిందన్న విషయాన్ని గుర్తుకు తెస్తున్నారు. గత ఎన్నికల్లో కూటమిగా ఏర్పడినప్పటికీ తమకు టిక్కెట్లు దక్కకపోయినా తాము చెప్పిన వారికి సీట్లు రాకపోయినా పార్టీ కోసం, పవన్ కల్యాణ్ కోసం పనిచేశామని అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పవన్ కల్యాణ్ జనసేన పార్టీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న అసహనం ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లాల్లో నామినేటెడ్ పదవుల భర్తీ మిగిలిన సామాజికవర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. కాపు సామాజివర్గమే గత ఎన్నికల్లో గెలిపించలేదని, కులాలు, మతాలకు అతీతంగా పనిచేయబట్టే అంతటి అద్భుతమైన విజయాన్ని సాధించామని అంటున్నారు. సోషల్ మీడియాలోనూ ఎక్కువగా ఈ ఎంపికపై వ్యతిరేకంగా పోస్టులు కనిపిస్తున్నాయి.. పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పవన్ కల్యాణ్ మాటలు ఆచరణలో కనిపించడం లేదంటున్నారు. నిజంగా క్షేత్రస్థాయిలో పని చేసిన వారికి పదవులు ఆశించకుండా పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షతోనే కసితో పనిచేశామని చెబుతున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల భర్తీ చూసిన వారికి ఎవరికైనా కాపులకు అధిక ప్రాధాన్యత మిస్తున్నట్లు స్పష్టంగా కనిపించడంతో మిగిలిన సామాజికవర్గాలు కొంత గుర్రుగా ఉన్నాయి. అయితే భర్తీ కావాల్సిన పోస్టులు చాలా ఉన్నాయని, దశలవారీగా అందరికీ అవకాశం కల్పిస్తామని పార్టీ నాయకత్వం చెబుతుంది. మొత్తం మీద పదవుల పంపకం మాత్రం జనసేన పార్టీలో కాక రేపుతుంది. వన్ బై వన్ వరసగా అందరికీ పోస్టులు దక్కుతాయని పవన్ కల్యాణ్ కూడా హామీ ఇస్తున్నారు. అంతవరకూ ఓపిక పట్టాలని కోరుతున్నారు.

## నేతలను నిలుపుకొనేది ఎలా



**విజయవాడ, మే 17, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ వరసగా సమావేశాలు పెడుతున్నప్పటికీ నేతలు మాత్రం పార్టీని వీడి వెళ్లిపోవడం ఆగడం లేదు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోతాడిపత్రి మున్సిపాలిటీ తప్ప దాదాపు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు వైసీపీ పరమయ్యాయి. అయితే నాడు అధికారంలో ఉండటంతో పాటు క్యాడర్ కూడా పోటీ పడి పనిచేయడంతో అంతటి విజయం లభించింది. అదే సమయంలో మూడు చోట్ల జరిగిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా అందరికీ అర్థమయింది. కూటమికి అనుకూల వాతావరణం ఏర్పడిందని, వైసీపీకి ఇబ్బందికరమైన పరిస్థితులు వచ్చాయన్న అంచనాలు వినిపించాయి. కానీ జగన్ మాత్రం గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పెద్దగా పట్టించుకోలేదు. వన్ మ్యాన్ షోతో రెండోసారి విజయం సాధించాలని భావించారు. ఎవరు చెప్పినా తలకెక్కించుకోకపోవడంతోనే గత ఎన్నికల్లో పదకొండు స్థానాలకు పరిమితమయ్యారు. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత నేతలతో పాటు స్థానిక సంస్థల నేతలు కూడా ఒక్కరూ మిగలడ లేదు. ఇప్పటికే చాలా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలూ కూటమి పరమయ్యాయి. ఛైర్మన్లు, మేయర్లు వారంతట వారే స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. కూటమి అభ్యర్థి ఛైర్మన్ గానో, మేయర్ గానో ఎన్నిక కావడానికి అవసరరమైన మార్గాన్ని వారే సుగమం చేస్తున్నారు. కావాల్సినంత బలం ఉన్నప్పటికీ పార్టీ వీడే వారి సంఖ్య ఎక్కువగా ఉంది.ఇక స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఆపేందుకు వరసగా తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, అప్పుడు కూడా పదవులు ఇతస్ష్మని భరోసా ఇస్తున్నారు. విశాఖ కార్పొరేటర్లతో సమావేశం అయి క్యాంపులకు తరలించినా చివరకు జగన్ మాటలను పెడచెవిన పెట్టి కార్పొరేటర్లు పార్టీని వీడి వెళుతున్నారు. జగన్ ఎంత నమ్మకంగా వచ్చేది మన ప్రభుత్వమేనని చెబుతున్నప్పటికీ ద్వితీయ శ్రేణి నేతలు విస్మరించడం లేదని అనడానికి ఇదొక నిదర్శనం అని చెప్పాలి. జగన్ సొంత జిల్లాలో కూడా నేతలు ఎవరూ ఉండటం లేదు. కడప మేయర్ ను ప్రభుత్వం తొలిగిస్తే, మేయర్ మున్సిపల్ ఛైర్మన్ మాత్రం తనంతట తానే తప్పుకున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినా వారు సంతృప్తికరమైన పాలన అందించలేకపోయామని అంటున్నారు. తాము మేయర్ గా ఉన్నా, చైర్మన్లుగా ఉన్నా తమకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదని, కనీసం తమ కార్పొరేషన్లకు, మున్సిపాలిటీలకు నిధులు కూడా జగన్ ఇవ్వలేకపోయారని, ఎన్నికల్లో తాము డబ్బు ఖర్చు పెట్టి గెలిచి కూడా నిధులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డామని చాలా మంది అంటున్నారు. ఎక్కువ మంది నేతలు పార్టీని వీడి వెళ్లడానికి ఆర్థికపరమైన ఇబ్బందులే కారణమి అంటున్నారు. అందుకే జగన్ ఎంత బుజ్జగించినా తాము మాత్రం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూటమి పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# లక్నోతో మ్యాచ్‌కు గుజరాత్ స్పెషల్ జెర్సీ.. ఎందుకంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో భాగంగా గురువారం (మే 22) గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జయింట్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ లో గిల్ సేన సరికొత్త జెర్సీలో మైదానంలోకి దిగబోతుంది. లావెండర్ కలర్ లో ఉన్న గుజరాత్ కొత్త జెర్సీ క్రికెట్ అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది. క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు.. క్యాన్సర్ రోగులను ఆదుకునేందుకు ఇది తమ ప్రత్యేక ప్రచారమని తెలుస్తుంది. లావెండర్ రంగు జెర్సీ ధరించి గుజరాత్ ఆటగాళ్లు గత సీజన్ లో సన్ రైజర్స్ పై మ్యాచ్ ఆడారు. ఈ సారి అదే జెర్సీతో లక్నోపై మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. లావెండర్ సాధారణంగా అన్నవాహిక క్యాన్సర్‌కు రంగు. కానీ ఇప్పుడు ఇది అన్ని రకాల క్యాన్సర్‌లకు ఉపయోగిస్తున్నారు. లావెండర్ జెర్సీని ధరించి గతంలో ఢిల్లీ డేర్‌డేవిల్స్ జట్టు కూడా ఆడింది. 2015 సీజన్‌లో మాజీ భారత స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ నేతృత్వంలో ఈ జెర్సీలో మ్యాచ్ ఆడింది. స్వయంగా క్యాన్సర్‌ను జయించిన యువరాజ్ సింగ్ చొరవతో ఢిల్లీ జట్టు లావెండర్ జెర్సీ ధరించి క్యాన్సర్‌పై
ప్రచారం నిర్వహించింది. లీగ్ దశలో హోమ్ గ్రౌండ్‌లో మ్యాచ్ ఆడుతోన్న గుజరాత్ టైటాన్స్.. సరికొత్త జెర్సీలో కనిపించనుంది. ప్రస్తుత సీజన్ లో గుజరాత్ టైటాన్స్ హవా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ ల్లో 8 విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో కొనసాగుతోంది. ఈ టోర్నీలో గిల్ సేన మరో మూడు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఒక మ్యాచ్ గెలిచినా ప్లే ఆఫ్స్ చేరడం గ్యారంటీ. రెండు మ్యాచ్ ల్లో గెలిస్తే టాప్ 2 లో నిలవొచ్చు. గుజరాత్ తమ తదుపరి మ్యాచ్ ఢిల్లీ క్యాపిటల్స్ తో ఆదివారం (మే 18) తలపడనుంది. ఆ తర్వాత సొంతగడ్డపై లక్నో సూపర్ జయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్ తో ఆడుతుంది.

# వెస్టిండీస్ క్రికెట్ షాకింగ్ నిర్ణయం.. రెండేళ్లు టెస్ట్ ఆడకపోయినా కెప్టెన్సీ బాధ్యతలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ మెన్స్ టెస్ట్ జట్టుకు ఆ దేశ క్రికెట్ బోర్డు కొత్త కెప్టెన్ ను ఎంపిక చేసింది. టెస్ట్ కెప్టెన్సీ నుంచి క్రెయిగ్ బ్రాత్‌వైట్ గత నెలలో వైదొలిగాడు. దీంతో అతని స్థానంలో వెస్టిండీస్ క్రికెట్ బోర్డు ఆల్ రౌండర్ రోస్టన్ ఛేజ్ ను టెస్ట్ కెప్టెన్ గా శనివారం (మే 17) అధికారికంగా ప్రకటించింది. ఛేజ్ రెండు సంవత్సరాలుగా టెస్ట్ క్రికెట్ ఆడకున్నా ఈ స్పిన్ ఆల్ రౌండర్ కే కెప్టెన్సీ పగ్గాలు అప్పగించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. క్రెయిగ్ బ్రాత్‌వైట్ స్థానంలో ఛేజ్ టెస్ట్ పగ్గాలు చేపడతాడు. 2021 లో టెస్ట్ కెప్టెన్సీ చేపట్టిన బ్రాత్‌వైట్ తన నాలుగేళ్ల కెప్టెన్సీకి గుడ్ బై చెప్పాడు. రోస్టన్ చేజ్ మార్చి 2023లో దక్షిణాఫ్రికాపై తన చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. రెండు సంవత్సరాలుగా సుదీర్ఘమైన ఫార్మాట్‌కు దూరంగా ఉన్న అతను తిరిగి జట్టులోకి రావడమే కాకుండా కెప్టెన్సీకి ఎంపికయ్యాడు. 2023 నుండి వెస్టిండీస్ 13 టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. అయితే చేజ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌గా పరిగణించలేదు. జూన్, జూలైలలో ఆస్ట్రేలియా వెస్టిండీస్ లో మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ నుంచి ఛేజ్ తన కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరిస్తాడు. జూన్ 25 నుండి బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో తొలి టెస్ట్ మ్యాచ్ తో సిరీస్ ప్రారంభమవుతుంది. 2016 నుంచి ఛేజ్ వెస్టిండీస్ టెస్ట్ క్రికెట్ లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 49 టెస్టుల్లో 26.33 సగటుతో 2265 పరుగులు చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్ లో 85 వికెట్లు పడగొట్టాడు. క్రికెట్ వెస్టిండీస్ జస్టిన్ గ్రీవ్స్, జాషువా డా సిల్వా, జాన్ కాంప్‌బెల్, జోమెల్ వారికన్, టెవిన్ ఇమ్లాచ్, రోస్టన్ చేజ్‌లను టెస్ట్ కెప్టెన్సీ అభ్యర్థులుగా షార్ట్‌లిస్ట్ చేసింది. తీవ్రమైన పరిశీలన తర్వాత, అధికారులు రోస్టన్ చేజ్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించాలని నిర్ణయించారు.

# క్యాపిటల్స్ మాస్టర్ ప్లాన్ ఫలిస్తుందా.. మరో ప్రయోగానికి రాహుల్ రెడీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తీవ్ర ఒత్తిడిలో కనిపిస్తోంది. తొలి నాలుగు మ్యాచ్ లు గెలిచి ప్లే ఆఫ్స్ బెర్త్ రేస్ లో అందరి కంటే ముందున్న ఢిల్లీ.. ఆ తర్వాత వరుస ఓటములు ఆ జట్టును కృంగదీశాయి. తొలి నాలుగు మ్యాచ్ ల్లో విజయం సాధించిన అక్షర్ సేన.. ఆ తర్వాత జరిగిన 7 మ్యాచ్ ల్లో రెండే గెలిచింది. ప్లే ఆఫ్స్ కు చేరాలంటే ఢిల్లీకి మిగిలిన మూడు మ్యాచ్ ల్లో రెండు విజయాలు తప్పనిసరి. మూడు మ్యాచ్ లు కూడా ముంబై, పంజాబ్, గుజరాత్ లాంటి జట్లతో ఉండడంతో కఠిన పరీక్ష తప్పేలా కనిపించడం లేదు. జట్టులో ఇప్పటికే నలుగురు ఫారెన్ ప్లేయర్లు దూరం కావడం ఆ జట్టుకు కోలుకోలేని దెబ్బ. ఆస్ట్రేలియా యువ సంచలనం జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ తో పాటు స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఈ సీజన్ ఐపీఎల్ కు అందుబాటులో ఉండదని అధికారికంగా తన నిర్ణయాన్ని తెలిపాడు. ఢిల్లీ క్యాపిటల్స్ వైస్ కెప్టెన్ గా వ్యవహరిస్తున్న ఫాఫ్ డుప్లెసిస్ ఐపీఎల్ కోసం ఇండియాకు రావట్లేదని తెలిపాడు. డుప్లెసిస్ తో పాటు సహచరుడు డెనోవన్ ఫెరారా మిగిలిన ఐపీఎల్ మ్యాచ్ లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఒకే సారి నాలుగు ఫారెన్ ప్లేయర్లను దూరం చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ కష్టాల్లో పడింది. జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, డుప్లెసిస్ దూరం కావడంతో ఇప్పుడు ఢిల్లీ ఆశలన్నీ ఆ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ పై పడింది. రాహుల్ ను ఢిల్లీ జట్టు ఓపెనర్ గా ప్రమోట్ చేయాలనీ భావిస్తోందట. కేఎల్ ఓపెనర్ గా బరిలోకి దిగడం దాదాపు ఖరారైనట్టు సమాచారం. ఈ సీజన్ లో రాహుల్ ఎక్కువగా నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఒకసారి ఓపెనర్ గా.. రెండు సార్లు మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. గతంలో ఓపెనర్ గా రాహుల్ కు అద్భుతమైన రికార్డ్ ఉంది. దీంతో కేఎల్ ను ప్లే ఆఫ్స్ ముందు కీలక మ్యాచ్ లకు ఓపెనర్ గా పంపించాలని చూస్తోంది. క్రీజ్ లో కుదురుకుంటే రాహుల్ అలవోకగా భారీ ఇన్నింగ్స్ ఆడగలడు. దీంతో ఢిల్లీ ఆశలన్నీ రాహుల్ పైనే పెట్టుకుంది. ఈ సీజన్ లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడిన 11 మ్యాచ్ ల్లో 13 పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్ లు పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ తో ఆడనుంది. రీ షెడ్యూల్ లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ తమ తొలి మ్యాచ్ ను ఆదివారం (మే 18) గుజరాత్ టైటాన్స్ తో ఆడనుంది.

## కాజల్ అగర్వాల్ ఈ డ్రెస్ లో టెంపరేచర్ పెంచింది



# ఆ సినిమా తమన్నాకి లాభమే కానీ..?

సినిమాల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ తమన్నా లీడ్ రోల్ ఛాన్స్ లు అందుకుంటుంది అంటే ఆమె టాలెంట్ ఏంటన్నది అర్థం చేసుకోవచ్చు. కెరీర్ లో ఒకప్పుడు స్టార్స్ తో నటించి సత్తా చాటిన తమన్నా కొన్నాళ్లు బాలీవుడ్ లో కూడా సందడి చేసింది. ఐత్ సౌత్ లో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ వేరు. అందుకే ఇక్కడే సినిమాలు చేస్తూ వస్తుంది. సీనియర్ హీరోలతో జత కడుతూ అలరిస్తుంది మిల్కీ బ్యూటీ. ఐతే తమన్నా ఈమధ్యనే ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అశోక్ తేజ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాకు కథ, కథనం, డైరెక్షన్ సూపర్ విజన్ అన్నీ తానై ఉన్నాడు సంపత్ నంది. ఈ సినిమా నిర్మాణంలో కూడా అతను భాగమని తెలిసిందే. ఉన్నంతలో ఓదెల 2 మీద మంచి బజ్ ఏర్పరచడమే కాకుండా అలాంటి సినిమాలు ఇష్టపడే ఆడియన్స్ ని మెప్పించేలా చేశారు. ఐతే తమన్నా ఈ సినిమాను చేయడం వల్ల ఆమె ప్లస్సే అయినట్టుగా చెప్పొచ్చు. ఓదెల 2 కమర్షియల్ గా కూడా ఓకే అనిపించేసింది.
సో తమన్నాతో ఇలాంటి ప్రయోగాలు చేయొచ్చు అనే విధంగా ఓదెల 2 తో ప్రూవ్ అయ్యింది. ఇప్పటివరకు తమన్నా ఇలా సోలోగా సింగిల్ హ్యాండెడ్ గా సినిమా అటెంప్ట్ చేయలేదు. ఈ తరహా కథలను ఒకప్పుడు అనుష్క చేసింది.. ఈమధ్య సమంత కూడా ఇలాంటి ప్రయత్నాలు చేసి మెప్పించింది. సో ఇప్పుడు తమన్నా కూడా డిఫరెంట్ కథలతో ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు చేస్తే ప్రేక్షకులు ఆదరించేలా ఉన్నారు. ఎలాగు కంటెంట్ ఉన్న సినిమాలకు కాస్టింగ్ ఎవరన్నది చూడరు. అక్కడ కొత్త వాళ్లు ఉన్నా ఆడియన్స్ సినిమాను ఎంకరేజ్ చేస్తారు. అదే తమన్నా లాంటి హీరోయిన్ కంటెంట్ బేస్డ్ సినిమాలు చేస్తే తప్పకుండా ఆడియన్స్ యాక్సెప్ట్ చేస్తున్నారు. ఓదెల 2 వల్ల తమన్నాకి చాలా వరకు బెనిఫిటే జరిగింది. నెక్ట్స్ కూడా ఆమె ఇలాంటి కథలను చేసేందుకు డేర్ చేస్తుందని చెప్పొచ్చు. సో కమర్షియల్ సినిమాలు, స్పెషల్ సాంగ్స్ మాత్రమే కాదు ఇక మీదట తమన్నా లేడీ ఓరియొంటెడ్ సినిమాలకు బెటర్ ఆప్షన్ అవుతుందని చెప్పొచ్చు. ఇది తమన్నాకి మంచి లాభమే చేకూరేలా చేస్తుంది. ఓదెల 2 తర్వాత తమన్నా వేసే నెక్ట్స్ స్టెప్ ఏంటన్నది ఆమె ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## అనసూయ భరద్వాజ్ సొగసైన లుక్ మనందరినీ ఉర్రూతలూగించింది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com